www.prajamantalu.com

సంపుటి : 5
సంచిక : 09
పేజీలు : 8
వెల : రూ. 4

# ప్రజా మంటలు

Prajamantalu
Jagtial

మా అక్షరాలు – నిజాల నిప్పుకణికలు

ఎడిటర్ : సిహెచ్.వి ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు : సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 8 (ప్రజా మంటలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలనలో మహిళల ప్రాతినిధ్యం, భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందన్నారు. అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి, ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతున్నదని చెప్పారు. మహిళల సాధికారితతో పాటు ఆర్థిక స్వావలంబనకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, ఇంటింటికీ రూ.500 గ్యాస్ సిలిండర్ గ్యారంటీలను కొత్త ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు, సమాన హక్కులు దక్కాలని సీఎం ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా త్వరలోనే మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపడుతామన్నారు. మహిళలకు అండగా ఉండేలా తమ ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలు అందుబాటులోకి తెస్తుందని అన్నారు. మహిళా సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం తప్పకుండా దేశమందరి దృష్టిని ఆకర్షిస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు.




# ఎన్నికలొచ్చినప్పుడే రాజకీయాలు..

- తర్వాత అభివృద్ధిపై దృష్టి
- గత పాలకులు ధనికుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు మెట్రోను ప్రతిపాదిస్తే మేం దానిని పేదలందరికీ పనికొచ్చేలా మార్పులు చేశాం
- పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 8 (ప్రజా మంటలు): హైదరాబాద్ పాత బస్తీ మెట్రోలైన్‌కు శుక్రవారం ఫరూక్ నగర్ డిపో దగ్గర శంకు స్థాపన చేశారు. ఎంజీ బీఎస్ నుంచి ఫలక్ నుమా వరకు మొత్తం 5.5 కిలోమీటర్ల పొడవునా 4 స్టేషన్లతో ఈ రైలు మార్గాన్ని నిర్మించనున్నారు.రూ. 2వేల కోట్ల అంచనా వ్యయంతో ఈ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలొచ్చినప్పుడే రాజకీయాలు.. తర్వాత అభివృద్ధిపైనే దృష్టి పెడతామన్నారు. మూడేండ్ల లో ప్రాజెక్టు పూర్తయ్యేలా సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేస్తుంద న్నారు. హైదరాబాద్‌కు తాగునీరు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ది అన్నారు . ఎంజీబీఎస్, దారుల్ షిఫా జంక్షన్, పురాణా హవేలీ, ఇత్తేబాద్ చౌక్, అలీ జాకోట్ల, మీర్ మోమిన్ దర్గా, హరిబౌలీ, శాలిబండ, షంషీర్ గంజ్, అలియా బాద్ ప్రాంతాల మీదుగా ఫలక్ నుమా వరకు ఈ మెట్రో లైన్ నిర్మాణం జరగనుంది. సాలర్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఫలక్ నుమా ఏరియాల్లో స్టేషన్లను నిర్మించనున్నారు. మతపరమైన చారిత్రక కట్టడాలకు డ్యామేజీ లేకుండా మిగతా 2లో..

## వంగర, ముత్తారం శివాలయాలలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



భీమదేవరపల్లి మార్చ్08 (ప్రజామంటలు) : ముత్తారం త్రికూటేశ్వర ఆలయం, వంగర శ్రీ కైలాస కళ్యాణ క్షేత్రాలను రవాణా, బీసీ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ తో, మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కలిసి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాబోయే కాలంలో మంచి వర్షాలు పడాలని, రైతులు సుఖ సంతోషాలతో, పాడిపంటలతో అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ, గతంలో తాను మాజీ ఎంపీగా ఉన్నప్పుడు ఆలయానికి వచ్చానని, అప్పటికి ఇప్పటికి ఆలయం కొంతమేరకు అభివృద్ధి చెందిందని అన్నారు. త్రి కుటేశ్వర ఆలయ అభివృద్ధిలో తాను భాగస్వామిగా ఉండి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ఆలయ పరిసరాలు సర్వాంగ సుందరంగా మారుతాయని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, ఆ పరమశివుని ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నానని అన్నారు. అంతకుముందు వారు వంగరలో మాట్లాడుతూ, మా ప్రభుత్వం రైతాంగానికి సాగునీరు అందించే విషయంలో మొదటి స్థానంలో ఉంటుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో దొరల పాలన పోయి ప్రజాపాలన వచ్చిందని అన్నారు. మా ప్రజా పాలన అప్లికేషన్ ప్రక్రియ చూసి ప్రతిపక్షాలు ఆశ్చర్యపోతున్నారని అన్నారు. ఈ విధంగా ప్రభుత్వ కార్యక్రమాలు పెరిగిపోతుంటే ఓర్వలేక రోజు రోజుకు అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రులు పార్టీలకతీతంగా ప్రధానులను కలవడం సాంప్రదాయమని, అది రాజ్యాంగంలోనే ఉందని అన్నారు.

**పటిష్ట బందోబస్తు -ప్రశాంతంగా ముగిసిన శివరాత్రి ఉత్సవాలు**

ముత్తారం త్రికుటేశ్వర ఆలయంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్సై సాయిబాబు, ఏఎస్ఐ సంపత్, కానిస్టేబుల్స్ మోహన్ బాబు, రమేష్, శివ, రవి, రమ, భగవాన్ సేవలు అందించారు.

**ముల్కనూర్ ఆరోగ్య సిబ్బంది సేవలు**

ఆలయ ప్రాంగణంలో ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య ఆసుపత్రి సిబ్బంది సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకురాలు చిదురాల స్వరూప, సురేష్, లయన్ వెంకట రమణ గౌడ్, ఆలయ చైర్మన్ ఏనుగు వెంకట సురేందర్ రెడ్డి, కొలుగూరి రాజు, ఆదరి రవి, చిత్రాల స్వరూప, సురేష్, ఊరడి జయపాల్ రెడ్డి, ఊరడి యోగేంధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, బొక్కల శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బొక్కల స్రవంతి, ఆలయ భక్త బృందం పాల్గొన్నారు.

## మణిపూర్‌లో మరో ఆర్మీ ఆఫీసర్ కిడ్నాప్

మణిపూర్,మార్చి8 (ప్రజా మంటలు): మణిపూర్‌లో అధికారుల కిడ్నాప్‌ల పరంపర కొనసాగుతోంది. తాజాగా మరొక ఆర్మీ అధికారి కిడ్నాప్‌కు గురయ్యారు. మణిపూర్‌లో ఇది నాల్గో సంఘటన కావడం విశేషం. మణిపూర్‌లోని తౌబాల్ జిల్లాకు చెందిన జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ కొన్సమ్ ఖేదా సింగ్‌ను శుక్రవారం ఉదయం 9 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి ఇంట్లో ఉన్న ఆఫీసర్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. మణిపూర్‌లో గత ఏడాది మేలో సరిహద్దు రాష్ట్రంలో జాతి హింస ప్రారంభమైనప్పటి నుంచి అధికారి కిడ్నాప్ కావడం ఇది నాల్గోది. రంగంలోకి దిగిన భద్రతా సిబ్బంది సర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టారు. జాతీయ రహదారిపై అన్ని వాహనాలను తనిఖీ లో ఎవరు కిడ్నాప్ చేశారో ఇంకా తెలియ లేదని అధికారులు తెలుపుతున్నారు.

# 36 మందితో కాంగ్రెస్ తొలి జాబితా విడుదల

- 36 మందితో కాంగ్రెస్ తొలి జాబితా విడుదల
- వయనాడ్ నుంచే రాహుల్ మరోమారు పోటీ
- ఛత్తీస్‌ఘడ్ నుంచి మాజీ సెం భూపేశ్ భగేల్ పేరు
- తిరువనంతపురం బరిలో మరోమారు శశిథరూర్
- తెలంగాణ నుంచి నాలుగు పేర్లు ప్రకటన
- తొలి జాబితలో చోటు దక్కని వంశీచంద్ పేరు
- చేవెళ్ల నుంచి సునీతా మహేందర్ రెడ్డికి చోటు
- జహీరాబాద్ నుంచి సురేష్ షెట్కార్
- నల్లగొండ నుంచి కుందూరు రఘువీర్
- మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్



న్యూఢిల్లీ,మార్చి8 (ప్రజా మంటలు): లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. దేశ వ్యాప్తంగా 36 మందితో కూడిన జాబితా విడుదలైంది. రాహుల్ గాంధీ ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్ నుంచి మరోమారు పోటీ చేస్తారు. తొలిజాబితాలో ఆయన పేరును ప్రకటించారు. అలాగే తిరువనంతపురం నుంచి శశిథరూర్ మరోమారు పోటీ చేయనున్నారు. ఇకపోతే ఛత్తీస్‌ఘడ్ మాజీ సిఎం భూపేశభగేల్ ఎంపిగా పోటీచేయబోతున్నారు. తాజా జాబితాలో కర్నాటక, కేరళలోనే అత్యధిక స్థానాలను ప్రకటించారు. ఇకపోతే తెలంగాణలో మొత్తం 17 పార్లమెంట్ స్థానాలకు గానూ తొలి జాబితాలో కేవలం నాలుగు స్థానాలకు మాత్రమే అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం నుంచి చల్లా వంశీచంద్ రెడ్డి పోటీ చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. కానీ ఈ స్థానాన్ని ప్రకటించకుండా కాంగ్రెస్ అధిష్టానం నలుగురి జాబితా ప్రకటించింది. .జహీరాబాద్ నుంచి సురేష్ షెట్కార్, నల్లగొండ నుంచి కుందూరు రఘువీర్, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్, చేవెళ్ల నుంచి సునీత మహేందర్ రెడ్డి పేర్లు జాబితాలో చోటుచేసుకున్నాయి.లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ స్పీడ్ పెంచింది. 36 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. కర్ణాటక, కేరళ, హరియాణ, త్రిపుర, సిక్కిం, మేఘాలయ, మణిపుర్ రాష్ట్రాల్లో మిగతా 2లో..



## ఎప్పటిలానే ఈ సారీ అధికారం మాదే - ప్రధాని మోదీ ధీమా

న్యూఢిల్లీ,మార్చి8 (ప్రజా మంటలు): 2014, 2019 ఎన్నికల ఫలితాలనే ఈ సారి పునరావృతం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. శుక్రవారం దిల్లీలోని భారత మండపం లో 'నేషనల్ క్రియేటర్స్ అవార్డు' లను ఆయన అందజేశారు. సృజనాత్మక వీడియోలు, కథనాలతో సమాజంలో మార్పు కోసం కృషి చేస్తున్న కంటెంట్ క్రియేటర్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను నూతనంగా ప్రవేశపెట్టింది. "స్టోరీ టెల్లింగ్, సామాజిక మార్పు, పర్యావరణ పరిరక్షణ, విద్య, గేమింగ్ వంటి వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి, ప్రోత్సహించడమే మిగతా 2లో..

## మేడిగడ్డ ఎందుకు కూలింది?

- ఎన్డీఎస్‌ఏ కమిటీ లోతైన అధ్యయం
- అన్నారం బ్యారేజీ సందర్శన
- సీపేజీలపై విస్తృత అధ్యయనం
- డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచన మేరకు నిర్ణయం
- కాళేశ్వరంపై నిపుణుల సలహాలే ముఖ్యమన్న శ్రీధర్ బాబు



హైదరాబాద్,మార్చి8 (ప్రజా మంటలు): జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలన రెండోరోజు కొనసాగుతోంది. నిపుణుల బృందం ఇవాళ అన్నారం బ్యారేజీని సందర్శించింది. గురువారం రాత్రి రామగుండంలో బస చేసిన కమిటీ సభ్యులు, అక్కడి నుంచి ఇవాళ ఉదయం నేరుగా అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. బ్యారేజీలో ఏర్పడ్డ సీపేజీలు, బుంగలు, లీకేజీల ప్రాంతాన్ని చూసి వివరాలు సేకరించారు. బ్యారేజీపై కలియతిరిగి విస్తృత అధ్యయనం చేశారు. మధ్యాహ్నం వరకు అన్నారం బ్యారేజీ వద్దనే పరిశీలించి అక్కడి నుంచి సుందిళ్ల బ్యారేజీకి వెళ్లారు.ఎన్డీఎస్ఏ కమిటీ మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు, మేడిగడ్డ బ్యారేజీ ఆరు, ఏడు, ఎనిమిది బ్లాక్‌లు, దెబ్బతిన్న, కుంగిన ప్రాంతాలను పరిశీలించారు. బ్యారేజీ వద్ద ఆనకట్ట కుంగుబాటుకు ఏ మేరకు ఉందన్నది నిశితంగా పరిశీలించారు. దిగువకు వెళ్లి, 7వ బ్లాక్?లోని 19, 20, 21 పియర్ల కుంగుబాటుకు దారితీసిన కారణాలను సమగ్రంగా అధ్యయనం చేశారు. బ్యారేజీకి ఏర్పడ్డ మిగతా 2లో..

## నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త ఇక ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల

### యూపిపిస్సీ తరహాలో నియామకాలు

హైదరాబాద్,మార్చి8 (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులకు రేవంత్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏళ్లకు ఏళు ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా మిగతా 2లో..



## 'జమిలి'పై త్వరలో నివేదిక

- అందించనున్న కోవింద్ కమిటీ




## పండుగపూట విషాదం

- శ్రీరాంసాగర్‌లో ముగ్గురు యువకులు గల్లంతు




నిజామాబాద్ (ప్రజా మంటలు): జిల్లాలో పండగపూట విషాదం చోటుచేసుకుంది. మిగతా 2లో..

## సారీ నాన్నా... నేను జేఈఈ చేయలేను

- కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం
- తండ్రికి క్షమాపణలు చెబుతూ సూసైడ్ లెటర్

కోటా (ప్రజా మంటలు): రాజస్థాన్‌లోని కోటాలో జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)కి సిద్ధమవుతున్న మిగతా 2లో..

## ప్రజా నాడి




# మహిళా దినోత్సవ కానుక

### సిలిండర్‌పై వంద తగ్గించిన మోడీ - ఎన్నికల జిమ్మిక్కు అంటూ విపక్షాల విసుర్లు



న్యూఢిల్లీ,మార్చి8 (ప్రజా మంటలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని మహిళలకు భారీ కానుక ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ..మహిళా దినోత్సవ కానుకగా ఎల్పిజి సిలిండర్ల ధరలను తగ్గిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఈ ప్రకటన చేశారు.ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో రూ.100 తగ్గింపు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రకటించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో ప్రధాని మోదీ ఈ సమాచారాన్ని ఇచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్‌పీజీ సిలిండర్ల ధరను రూ. 100 తగ్గించినట్టు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనపై విపక్షాలు స్పందించాయి. మహిళా దినోత్సవం సందర్భంగా నారీ శక్తిని బలపరిచే క్రమంలో వంట గ్యాస్ ధరను సిలిండర్‌కు రూ. 100 చొప్పున తగ్గించాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే కేంద్రం నిర్ణయంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ ఎత్తుగడేనని, ఇది మోదీ సర్కార్ మోసపూరిత చర్యని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే ఆక్షేపించారు. మిగతా 2లో..



## మహాశివరాత్రి ఊరేగింపులో విషాదం

**శివ బారాత్‌లో 14 మంది చిన్నారులకు విద్యుద్ఘాతం**

కోట,మార్చి8 (ప్రజా మంటలు): మహాశివరాత్రి రోజు ఊరేగింపులో విషాదం చోటు చేసుకుంది. రాజస్థాన్ లోని కోటాలో శివ బారాత్ ఉత్సవంలో దాదాపు 14 మంది చిన్నారులు విద్యుతాఘాతానికి గురైయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. కాళీ బస్తీ నుండి భక్తులు కలశంతో ఊరేగింపుగా బయలుదేరారు. అదే సమయంలో ఓ పిల్లవాడు 20 ఫిట్స్ ఉండే ఐరన్ పైప్ పట్టుకొని వెళ్తున్నాడు. పైప్ హైటెన్షన్ మిగతా 2లో..

# నగరం శిఖలో డబుల్ డెక్కర్ కారిడార్

### రూ.1,580 కోట్ల వ్యయంతో కారిడార్

### నేడు నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన



హైదరాబాద్, మార్చి 8 (ప్రజా మంటలు): జంట నగరాలతో పాటు ఉత్తర తెలంగాణలోని ఐదు జిల్లాల ప్రజలు, వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## నగరం శిఖలో డబుల్ డెక్కర్ కారిడార్

## రూ.1,580 కోట్ల వ్యయంతో కారిడార్

### నేడు నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన

రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. జాతీయ రహదారి 44పై దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న వాహనదారుల కష్టాలకు చరమగీతం పాడేందుకు రూ.1,580 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 5.320 కిలోమీటర్ల మేర కారిడార్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కడ్లకోయ జంక్షన్ సమీపంలో శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ పై తర్వాత మెట్రో మార్గం నిర్మించనున్నారు. ఈ రకంగా నగరంలో తొలి డబుల్ డెక్కర్ కారిడార్‌కు నేడు నాంది ప్రస్థానం ప్రారంభం కానుంది. హైదరాబాద్, సికింద్రా బాద్‌తో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి, నిర్మల్-ఆదిలాబాద్ మీదుగా సాగే ఎన్‌హెచ్-44పైన జంట నగరాల్లో విపరీతమైన వాహన రద్దీతో నగర ప్రజలు, ప్రయాణికులు నిత్యం పలు అవస్థలు పడుతున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో రహదారుల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో రక్షణ శాఖ స్టాండింగ్ సభ్యునిగా ఉన్న రేవంత్ రెడ్డి ఆ కమిటీ సమావేశాల్లోనూ కంటోన్మెంట్ ప్రాంతంలో రహదారుల విషయంలో ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై చర్చను కొనసాగించేవారు. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడంతో ఈ అంశంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది జనవరి అయిదో తేదీన స్వయంగా కలిసి రాజధాని నగరంలో కంటోన్మెంట్ ప్రాంతంలో రహదారుల విస్తరణ రక్షణ శాఖ భూములు తమకు అప్పగించాలని, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి స్పందించిన రక్షణ శాఖ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అంగీకరిస్తూ మార్చి ఒకటో తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపింది. వెంటనే రంగంలోకి దిగిన రాష్ట్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఎన్‌హెచ్-44పై సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి మొదలై తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్ మీదుగా డెయిరీ ఫాం రోడ్డు వద్ద ముగుస్తుంది. ఈ మొత్తం కారిడార్ పొడవు 5.320 కిలోమీటర్లు. ఇందులో ఎలివేటెడ్ కారిడార్ 4.650 కిలోమీటర్లు ఉంటుంది. అండర్ గ్రౌండ్ టన్నెల్ 0.600 కి.మీ ఉంటుంది. మొత్తం 131 పియర్స్ (స్తంభాలు) ఉంటాయి. మొత్తం ఆరు వరుసల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. ఎలివేటెడ్ కారిడార్‌పైకి రాకపోకలు సాగించేందుకు వీలుగా బోయినపల్లి జంక్షన్ సమీపంలో ఇరువైపులా (0.248 కి.మీ. వద్ద), (0.475 కిలోమీటర్ వద్ద) రెండు చోట్ల ర్యాంపులు నిర్మిస్తారు%్రా% ఇది పూర్తయిన తర్వాత ఈ ఎలివేటెడ్ కారిడార్‌పై మెట్రో మార్గం నిర్మించనున్నారు. ఫలితంగా ఆ మార్గంలో ప్రయాణం మరింత క్షేమంగా, వేగంగా, సుఖవంతంగా సాగనుంది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్న ప్రాంతంలో ప్యారడైజ్ జంక్షన్ వద్ద రోజుకు సగటున 1,57,105 వాహనాలు (ప్యాసింజర్ కార్ యూనిట్ ఫర్ డే -పీసీయూ) పయనిస్తుంటే, ఓఆర్ ఆర్ జంక్షన్ సమీపంలో 72,687 వాహనాలు పయనిస్తున్నాయి. ఇరుకైన రహదారి కావడం, ఇంత పెద్ద మొత్తంలో వాహన రాకపోకలతో నిత్యం వాహనదారులు, ఆయా ప్రాంతాల ప్రజలు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. తరచూ రహదారి ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. అత్యవసర సమయాల్లో గమ్యాన్ని చేరుకోలేక ప్రయాణికులు తీవ్ర ఒత్తిడి, అసహనానికి గురవుతున్నారు. వాహన రద్దీతో గంటలకొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుండడంతో ఇంధనానిని భారీగా వ్యయం అవుతోంది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో సమయం కలిసిరావడంతో పాటు ఇంధనంపై అయ్యే వ్యయం తగ్గుతుంది. ప్రమాదాల సంఖ్య తగ్గిపోనుంది.

## ఎన్నికలొచ్చినప్పడే రాజకీయాలు

### .. తర్వాత అభివృద్ధిపైనే దృష్టి

రోడ్డు విస్తరణను 100 ఫీట్లకే పరిమితం చేశారు. స్టేషన్ల వద్ద రోడ్డును 120 ఫీట్లకు విస్తరించాలని నిర్ణయించారు. ఈ లైన్ అందుబాటులోకి వస్తే చార్మినార్,సాలర్ జంగ్ మ్యూజియం వంటి చారిత్రక కట్టడాలను చూసేందుకు పర్యాటకులకు సౌకర్యంగా ఉటుంది. శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం వెంట ఎంపీ అసదుద్దీన్ తదితరులు ఉన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా వరకు మెట్రోను పొడగించనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల పొడవునా ఈ రైలుమార్గంలో 5 మెట్రో స్టేషన్లు ఉంటాయి. దీనికి రూ.2 వేల కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. నిర్మాణం పూర్తయితే సికింద్రాబాద్ నుంచి జేబీఎస్, ఎంజీబీఎస్ మీదుగా పాతబస్తీకి ప్రయాణం చేయొచ్చు. సాలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్ గంజ్, ఫలక్ నుమా మెట్రో స్టేషన్లు ఉంటాయి. మత పరమైన నిర్మాణాలకు ఆటంకాలు సృష్టించకుండా మెట్రో నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. కేటాయించిన నిధుల్లో రూ.వెయ్యి కోట్లు స్థల సేకరణకే వెళ్తాయని అధికారులు చెబుతున్నారు. ఓల్డ్ సిటీ మెట్రో అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు పాతబస్తీ మరింత అభివృద్ధి దిశలో దూసుకుపోతుందని అంటున్నారు.

హైదరాబాద్‌లో ప్రతి గల్లీ అభివృద్ధి మా ప్రభుత్వం బాధ్యతే

హైదరాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలంగాణ 2050 వైబ్రెంట్ మాస్టర్ ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. భాగ్యనగర ప్రగతిని నిరాటంకంగా కొనసాగించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు సీఎం వివరించారు. ఎంజీబీఎస్-ఫలక్‌నుమా వరకు ఐదున్నర కిలోమీటర్ల మేర మెట్రోరైలు మార్గానికి సీఎం, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో కలిసి శంకుస్థాపన చేశారు.గత ప్రభుత్వాల హయాంలో జరిగిన భాగ్యనగర అభివృద్ధిని ఏమాత్రం తగ్గకుండా సర్కార్ పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. పాతబస్తీలో రోడ్ల విస్తరణకు రూ.200 కోట్లు, మీరాలం వంతెన కోసం 360 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ చాంద్రాయణజంక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పిన సీఎం పాతబస్తీకిఅవసరమైన నిధులన్నీ సమకూరుస్తామని తెలిపారు. "కులీ కుతుబ్‌షా నుంచి మొదలు పెడితే, నిజాం నవాబులు వరకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా చేయడానికి అహర్నిశలు కృషి చేశారు. అంతర్జాతీయ చిత్ర పటంలో భాగ్యనగరానికి ఒక ప్రత్యేకమైన ప్రతిష్ఠను తీసుకువచ్చారు. ఆ ఖ్యాతిని కొనసాగించాల్సిన బాధ్యత మా ప్రభుత్వం మీద ఉంది. ఎన్నికలు వచ్చినపుడే రాజకీయాలు, మిగతా సమయంలో అభివృద్ధినే ప్రధానంగా దృష్టిలో పెట్టుకొని నడుచుకుంటాం.ఓల్డ్ సిటీగా ప్రసిద్ధి చెందిన పాతబస్తీనే అసలైన హైదరాబాద్‌గా సీఎం అభివర్ణించారు. గత ప్రభుత్వం ధనికుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు మెట్రో మార్గం ప్రతిపాదించగా, తమ ప్రభుత్వం మాత్రం పేదలందరికీ పనికొచ్చేలా మార్పులు చేసిందని సీఎం పేర్కొన్నారు. చంచల్‌గూడ కారాగారాన్ని నగరం శివారు ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్, పాతబస్తీ వాసుల చదువు కోసం విద్యాలయాలను అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. దేశంలో ఉన్న అందరు ముస్లింల గొంతుకగా వారి సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాత్రమేని ముఖ్యమంత్రి కొనియాడారు.ఎంపీ అసదుద్దీన్ మాట్లాడుతూ" రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఈ స్థాయికి వచ్చారు "హైదరాబాద్‌కు గుండెలాంటి పాతబస్తీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వాగతం. ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేస్తారని ఆశిస్తున్నాం. రేవంత్‌రెడ్డి చాలా పట్టుదలతో ఇంతటి స్థాయికి వచ్చారు. రాష్ట్రంలో ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారు. కొన్ని శక్తులు విధ్వంసానికి కుట్రలు పన్నుతున్నాయి, వాటిని సమూలంగా అడ్డుకోవాలి. పాతబస్తీలో అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రిని కలవగానే రూ.120 కోట్లు విడుదల చేశారు. రాష్ట్రాభివృద్ధిలో రేవంత్‌రెడ్డికి మేం అండగా ఉంటాం." అని పేర్కొన్నారు.

## నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త

## ఇక ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల

### యూపిపిస్సీ తరహాలో నియామకాలు

ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నారు. ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ తరహాలో నిర్ణీత కాలవ్యవధి తో ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుంది. ఇకపై ఏటా జనవరి 1వ తేదీన టీఎస్‌పీఎస్సీ, గురుకుల, పోలీసు, వైద్య నియామక బోర్డుల ఆధ్వర్యంలో జాబ్ క్యాలెండర్లు ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తోంది. టీఎస్పీయస్సీ గ్రూప్-1, 2, 3, 4లతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల ఖాళీల వివరాలను ప్రకటనలు వెలువరించడం వల్ల నిరుద్యోగులు ప్రణాళికాబద్ధంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేం దుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ప్రామాణిక రాష్ట్రస్థాయి ముసాయిదా జాబ్ క్యాలెండర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీన్ని త్వరలోనే ప్రభుత్వ అనుమతి కోసం పంపించనుంది. ప్రభుత్వం అనుమతి వచ్చిన వెంటనే.. ఈ ఏడాది నుంచే జాబ్ క్యాలెండర్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. యూపీఎస్సీ, ఎస్‌ఎస్‌సీ, కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలో ఏటా తెలంగాణలో కూడా రాష్ట్ర జాబ్ క్యాలెండర్ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తామని కొత్త ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించింది. ముందుగా ప్రకటించిన ప్రకారంగా ఆయా విభాగాల్లోని రాష్ట్రస్థాయి ఉద్యోగాలకు ప్రామాణిక జాబ్ క్యాలెండర్ సిద్ధం చేయాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన తరువాత ఏ నెలలో ఏ నోటిఫికేషన్ ఇస్తారు. ఏయే నెలల్లో పరీక్షలు జరుగుతాయి.నియామక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందనే విషయాలను అందులో స్పష్టంగా తెలియజేస్తారు. జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన తేదీల మేరకు ఆయా గడువు తేదీల్లోగా నియామకాలు పూర్తవుతాయి. దీనిపై ప్రభుత్వ విభాగాధి పతుల సలహాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీసుకుంటోంది. సర్వీసు నిబంధనలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడంతోపాటు, ఖాళీల గుర్తింపు, ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులు వంటి తదితర అంశాలను తెలుసుకుంటోంది. జాబ్ క్యాలెండర్ అమల్లోకి వస్తే.. టీఎస్‌పీఎస్సీ, పోలీసు, గురుకుల, వైద్యఆరోగ్య నియామక బోర్డుల నుంచి యేటా ఉద్యోగ ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది.

## లోక్‌సభ ఎన్నికలకు 36 మందితో

## కాంగ్రెస్ తొలి జాబితా విడుదల

అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్ నుంచి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీ చంద్‌రెడ్డిని పార్టీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించినప్పటికీ, అనివార్య కారణాల వల్ల ఆ నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న తరుణంలో ఏఐసీసీ అభ్యర్థుల జాబితాపై కసరత్తు ముమ్మరం చేసింది. ఢిల్లీలో టీపీసీసీ నేతలతో కాంగ్రెస్ సీఈసీ సమావేశం అయ్యింది. రాహుల్ గాంధీ కేరళ వాయనాడ్ నుంచి పోటీ చేస్తారని ఏఐసీసీ స్పష్టం చేసింది. ఇక మార్పు చేర్పులు పూర్తి అయ్యాక, తుది జాబితాను ప్రకటిస్తామని పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ నుంచి 7 స్థానాలకు అభ్యర్థులు ఖరారు అయ్యినట్లు సమాచారం వచ్చినా ఎందుకనో నాలుగుసీట్లను మాత్రమే ప్రకటించారు. చేవెళ్ల నుంచి మాజీమంత్రి పి.మహేందర్ రెడ్డి భార్య సునీతా మహేందర్ రెడ్డి పేరును ప్రకటించారు. వీరిద్దరూ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. ఆమె జడ్పీ ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. గురువారం ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, జై రాం రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలతో కాంగ్రెస్ సీఈసీ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ భేటీకి తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి
ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో తెలంగాణ నుంచి పోటీ చేసే లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. నియోజకవర్గాల వారీ బలాబలాలు, సామాజిక సమీకరణల ప్రకారం అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరిపారు. పదిమంది పేర్లతో తొలి జాబితా విడుదల అవుతుందని ప్రచారం జరిగింది. తెలంగాణలో 17 లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. మహబూబ్‌నగర్ నుంచి వంశీచందర్ రెడ్డి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభలో ప్రకటించారు. దీంతో మిగతా 16 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా వెలువడాల్సి ఉంది. కాగా, సికింద్రాబాద్, పెద్దపల్లి, నల్గొండ, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలపై ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం.

కేరళ- తెలంగాణ లోక్‌సభ అభ్యర్థుల జాబితా ఖరారు చేసేందుకు నిర్వహించిన కాంగ్రెస్ సీఈసీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. కేరళ వయనాడ్ నుంచి రాహుల్ పోటీ చేస్తారని ఏఐసీసీ ప్రకటించింది. 2019 ఎన్నికల్లో రాహుల్ వయనాడ్‌తో పాటు అమేథీలో కూడా పోటీ చేశారు. అమేథీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి స్మృతీ ఇరానీ రాహుల్ గాంధీని ఓడించారు. అమేథీలో ఓడినా వాయనాడ్‌లో మాత్రం ఘన విజయం సాధించారు. అయితే ఈసారి వాయనాడ్‌లో ఇండియా కూటమి మిత్రపక్షం సీపీఐ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిందని, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా సతీమణి అనీ రాజాను అభ్యర్థిగా ప్రకటించారని ప్రచారం జరిగింది. దీంతో రాహుల్‌ను తెలంగాణ నుంచి కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఖమ్మం నియోజకవర్గం నుంచి పోటీ చేయించేందుకు తెలంగాణ పీసీసీ ప్రయత్నించింది. అయితే ఈ ఊహాగానాలకు చెక్ పెడుతూ రాహుల్ వయనాడ్ నుంచే పోటీ చేస్తారని ఏఐసీసీ స్పష్టం చేసింది. కాంగ్రెస్ తొలి జాబితాలో తిరువనంతపురం నుంచి శశి థరూర్, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ పేర్లు కూడా చేరాయి. ఈ ఇద్దరు అనుభవజ్ఞుల పేర్లను కూడా మొదటి జాబితాలో చేర్చడం విశేషం. బీజేపీ ఇప్పటికే 9 మంది అభ్యర్థులను ప్రకటించి ప్రచారం కూడా ముమ్మరంగా చేస్తోంది. ఈ తరుణంలో ఏఐసీసీ కేవలం నలుగురి పేర్లతో తొలి జాబితా విడుదల చేయడం గమనార్హం.

### మహాశివరాత్రి ఉరేగింపులో విషాదం

**శివ బారాత్‌లో 14 మంది చిన్నారులకు విద్యుద్ఘాతం**

వైర్లకు తాకి బాబుతో పాటు చుట్టు పక్కల ఉన్న 13 మందికి తీవ్ర గాయాలైయ్యాయి. వారిని కోటలోని ఓఃఃూ హాస్పిటల్ లో చేర్పించి ట్రీట్మెంట్ అందిస్తున్నారు. సీరియస్ గా ఉన్నవారిని జైపూర్ లోని మరో హాస్పిటల్ కు రిఫర్ చేశారు. వారిలో 25 సంవత్సరాలు ఉన్న వ్యక్తి తప్పా మిగితావారందరూ 14సంవత్సరాల లోపు వారే ఉన్నారు. ఓ పిల్లాడికి లోక్ సభ స్పీకర్, కోటా ఎంపీ ఓం బిర్లా ప్రమాదంపై స్పందించారు. చిన్నారులకు మెరుగైన ట్రీట్మెంట్ అందించాలని డాక్టర్లను ఆదేశించారు. రాజస్థాన్ మంత్రి హీరాలాల్ నగర్ మాట్లాడుతూ.. ఇది చాలా బాధాకరమైన సంఘటన, ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు, ఒకరికి 100? కాలిన గాయాలు ఉన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరి నిర్లక్ష్యమైన ఉంటే విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## మేడిగడ్డ ఎందుకు కూలింది?

పగుళ్లను నిశితంగా పరిశీలించారు.రాఫ్ట్ దిగువన ఇసుక పూర్తిగా కొట్టుకుపోయి ఖాళీ ఏర్పడి ఉండటాన్ని కమిటీ సభ్యులు గమనించారు. బ్యారేజీ6, 8 బ్లాకుల పియర్లలోనూ పగుళ్లు ఏమైనా ఉన్నాయన్నది, నిపుణుల బృందం పరిశీలించింది. ఆనకట్ట సామర్థ్యాన్ని పూర్తిగా విశ్లేషించి, ఎలాంటి మరమ్మతులు అవసరమో ఈ కమిటీ సిఫార్సు చేయనుంది. ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీకి కేంద్ర జల సంఘం మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వం వహిస్తున్నారు. కమిటిలో మరో ఐదుగురిని సభ్యులుగా నియమించారు. సెంట్రల్ సాయిల్ అండ్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త యూసీ విద్యార్థి, సెంట్రల వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషఽ శాస్త్రవేత్త ఆర్‌పాటిల్, కేంద్ర జల సంఘం డైరెక్టర్లు శివ కుమార్ శర్మ, రాహుల్ కుమార్ సింగ్‌ఉన్నారు. ఎన్‌డీఎస్ఏ టెక్నికల్ డైరెక్టర్ అమితాబ్ మీనా కమిటీ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని కమిటీ నాలుగు నెలల లోపు నివేదిక ఇవ్వాలని ఎన్‌డీఎస్ఏ గడువు నిర్దేశించింది. మూడు ఆనకట్టల డిజైన్లకు సంబంధించిన ఫిజికల్, మేథమెటికల్ మోడల్ స్టడీస్‌ను పరిశీలించాలని పేర్కొంది. మేడిగడ్డ ఆనకట్ట కుంగుబాటుతో ఇతర అంశాలకు కారణాలను కమిటీ పరిశీలించాలని స్పష్టం చేసింది. మూడు ఆనకట్టల విషయంలో తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణ, తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫార్సు చేయాల్సి ఉంటుంది. భవిష్యత్?లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను కూడా కమిటీ సూచించాల్సి ఉంటుంది.

**డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచన మేరకు నిర్ణయం**

డ్యామ్ సేఫ్టీ అధికారులు, నిపుణుల సూచన మేరకే కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌ల విషయంల నిర్ణయం తీసుకుంటామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. వారిచ్చే నివేదిక పరిశీలించి ముందుకు వెళతామని అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బిక్షేశ్వర స్వామి దేవాలయంలో ఆయన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ సాగునీటికి ఇబ్బందులు లేకుండా.. తాగునీటికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు అర్చకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాళేశ్వరం విషయంలో అవినీతిని పక్కన పెట్టి బిఆర్ఎస్ నేతలు గొప్పలు చెబుతున్నారని అన్నారు. అసలు విషయాలను మాట్లాడడం లేదన్నారు. నీళ్లు నింపాలంటే డ్యామ్ సేఫ్టీ అన్న విషయాన్ని గుర్తించడం లేదన్నారు.

## 'జమిలి'పై త్వరలో నివేదిక

### - అందించనున్న కోవింద్ కమిటీ

**దిల్లీ(జనంసాక్షి):** ఏకకాల ఎన్నికలపై భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ తన తుది నివేదికను సిద్ధం చేసినట్లు సమాచారం.దీనిని ప్రభుత్వానికి త్వరలో అప్పగించే పనిలో నిమగ్నమైనట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలను అన్వేషించి తగు సిఫార్సులు చేసేందుకుగాను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో సెప్టెంబర్ 2023న ఓ కమిటీ ఏర్పాటైంది.2029 నుంచి ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేలా నిబంధనలను మార్చే విధానాన్ని సూచించడమే కాకుండా లోక్‌సభ, అసెంబ్లీలతోపాటు అన్ని స్థానిక సంస్థల ఎన్నికలకు ఉమ్మడి ఓటరు జాబితా ఉండాలని సిఫార్సు చేయనున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలతోపాటు రాజ్యాంగంలో కనీసం ఐదు ఆర్టికల్స్‌ను సవరించాల్సిన అవసరం ఉంటుందని తెలుస్తోంది. పార్లమెంటు సభల వ్యవధిపై ఆర్టికల్ 83, రాష్ట్రపతి లోక్‌సభ రద్దుపై ఆర్టికల్ 85, రాష్ట్ర శాసనసభల వ్యవధికి సంబంధించి ఆర్టికల్ 172, రాష్ట్ర శాసనసభల రద్దుపై ఆర్టికల్ 174, రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి సంబంధించి ఆర్టికల్ 356 ఇందులో ఉన్నట్లు సమాచారం.రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుండగా.. స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లు నిర్వహిస్తాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లు నిర్వహించాలని భాజపా వంటి పార్టీలు కోవింద్ కమిటీకి సూచించాయి. మరోవైపు ఒకవేళ జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల కోసం ప్రతీ 15 ఏళ్లకు సుమారు రూ.10వేల కోట్లు అవసరమవుతాయని కేంద్ర ఎన్నికల సంఘం అంచనా వేసింది.ఇదిలాఉంటే, జమిలి ఎన్నికలపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రుతురాజ్ అవస్థీ నేతృత్వంలోని న్యాయ కమిషన్ కూడా కీలక సిఫార్సులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు వీలుగా రాజ్యాంగంలో కొత్త అధ్యాయాన్ని (చాప్టర్) చేర్చాలని అది సూచించనున్నట్లు తెలుస్తోంది. ఈ నివేదిక ప్రకారం.. దేశంలో తొలి జమిలి ఎన్నికలు 2029 మే-జూన్‌లో జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాలు ఇటీవల వెల్లడించాయి.

### పండుగపూట విషాదం

### - శ్రీరాంసాగర్‌లో ముగ్గురు యువకులు గల్లంతు

శ్రీరాంసాగర్ జలాశయంలో ముగ్గురు గల్లంతయ్యారు. ఈ విషాదకర ఘటన మెండోర మండలం ముప్కాల్ ఎస్సారెస్సీ లక్ష్మీకాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద శుక్రవారం జరిగింది. యువకుల కోసం స్థానికులు, అధికారులు గాలిస్తున్నారు. గల్లంతైన యువకులు జక్రాన్ పల్లి మండలం గున్యాతండా చెందిన సాయినాథ్, లోకేష్, మున్నాగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆందోళన చెందున్నారు.

## ఎప్పటిలానే ఈ సారీ అధికారం మాదే

### - ప్రధాని మోదీ ధీమా

ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశం" అని ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది."మహిళా దినోత్సవం, శివరాత్రి రోజున ఈ అవార్డులను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. విజేతలకు నా అభినందనలు. సృజనాత్మకతతో ఈ రోజు మీరంతా ఇక్కడిదాకా చేరుకున్నారు. భారత్ భవిష్యత్తు గురించి చర్చించేందుకే మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. పరిస్థితులకు అనుగుణంగా వచ్చే మార్పులను స్వీకరించడం మన బాధ్యత. తక్కువ ధరకు డేటా, మొబైల్ ఫోన్లు లభిస్తుండటంతో ఎంతో మంది కంటెంట్ క్రియేటర్లకు అవకాశం లభిస్తోంది. ఈ అవార్డులు దేశంలోని ప్రతి యువ కంటెంట్ క్రియేటర్ ప్రతిభకు నిదర్శనం. గత ఎన్నికల్లో మాదిరే ఈ సారి భాజపా క్లీన్‌స్వీప్ చేస్తుంది. అదే మా లక్ష్యం" అని ప్రధాన మోదీ అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ అంబాసిడర్ అవార్డు అందుకున్న మల్హార్ కలాంబేను ఉద్దేశించి 'సన్నగా కనిపిస్తున్నావ్.. బాగా తినాలి' అని సరదాగా వ్యాఖ్యానించారు.ఈ అవార్డుల కోసం 20 విభాగాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 1.5 లక్షల నామినేషన్స్ వచ్చాయి. వారికి మద్దతుగా పది లక్షల మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులోంచి 23 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురు అంతర్జాతీయ క్రియేటర్స్ ఉన్నారు. మోస్ట్ క్రియేటివ్ క్రియేటర్ అవార్డును మహిళల విభాగంలో శ్రద్ధ, పురుషుల విభాగంలో ఆర్జే రౌనాక్ అందుకున్నారు. గ్రీన్ ఛాంపియన్ - పంక్తి పాండే, స్టోరీ టెల్లింగ్ - కీర్తిక గోవింద్‌స్వామి, కల్చరల్ అంబాసిడర్ ఆఫ్ ది ఇయర్ - గాయని మైథిలి ఠాకూర్, సాంకేతికం - గౌరవ్ చౌధురి, పర్యటకం - కామియా జానీ, సామాజిక మార్పు - జయ కిషోరి, ఫ్యాషన్ - జాన్వీ సింగ్, స్వచ్ఛ్ అంబాసిడర్ - మల్హార్ కలాంబే, బెస్ట్ ఇంటర్నేషనల్ క్రియేటర్ - డ్రూ హిక్స్, డిస్‌రప్టర్ ఆఫ్ ది ఇయర్ - రణవీర్ అల్హాబాదియా, సెలబ్రిటీ క్రియేటర్ ఆఫ్ ది ఇయర్ - అమన్ గుప్తా, నానో క్రియేటర్ - పీయూష్ పురోహిత్, మైక్రో క్రియేటర్ - అరిదమాన్, గేమింగ్ - నిశ్చయ్, ఫిట్‌నెస్ - అంకిత్ బైయన్‌పురియా, విద్య - నమన్ దేశ్‌ముఖ్, ఫుడ్ - కబితా సింగ్.

### సారీ నాన్నా... నేను జేఈఈ చేయలేను

ఓ విద్యార్థి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన అభిషేక్ కుమార్‌కోటాలోని విజ్ఞాన్ నగర్‌లో తాను అద్దెకు ఉంటున్న గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అభిషేక్ విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. "సారీ నాన్నా... నేను జేఈఈ చేయలేను" అని తన తండ్రిని ఉద్దేశించి రాసిన సూసైడ్ నోట్ గదిలో లభ్యమైంది. కోచింగ్ సెంటర్‌లో జనవరి 29, ఫిబ్రవరి 19న జరిగిన రెండు పరీక్షలకు అభిషేక్ హాజరుకాలేదని పోలీసులు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో జిల్లా యంత్రాంగం కౌన్సెలింగ్ సౌకర్యాలను అందించడానికి, కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ వారి ఆత్మహత్యలు ఆగట్లేదు. గత ఏడాది 26 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడగా ఈ సంవత్సరం మొదటి మూడు నెలల్లోనే అరడజను కేసులు నమోదవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తమవడంతో కేంద్రం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా శిక్షణ ఇవ్వాలని సూచించింది. అటు విద్యార్థుల మరణాలను నియంత్రించేందుకు భవనాల చుట్టూ ఇనుప వలలు, గదుల లోపల స్ప్రింగ్ ఫ్యాన్లను అమర్చారు. అయినప్పటికీ ఇవి ఆగకపోవడం కలవరపెడుతోంది.

### మహాశివరాత్రి ఉరేగింపులో అపశృతి

### - శివ బారాత్‌లో 14 మంది చిన్నారులకు విద్యుద్ఘాతం

**కోట (ప్రజా మంటలు):** మహాశివరాత్రి రోజు ఉరేగింపులో విషాదం చోటు చేసుకుంది. రాజస్థాన్ లోని కోటాలో శివ బారాత్ ఉత్సవంలో దాదాపు 14 మంది చిన్నారులు విద్యుతాఘాతానికి గురైయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. కాళీ బస్తీ నుండి భక్తులు కలశంతో ఉరేగింపుగా బయలుదేరారు. అదే సమయంలో ఓ పిల్లవాడు 20 ఫిట్స్ ఉండే ఐరన్ పైప్ పట్టుకొని వెళ్తున్నాడు. పైప్ హైటెన్షన్ వైర్లకు తాకి బాబుతో పాటు చుట్టు పక్కల ఉన్న 13 మందికి తీవ్ర గాయాలైయ్యాయి. వారిని కోటలోని ఓఃఃూ హాస్పిటల్ లో చేర్పించి ట్రీట్మెంట్ అందిస్తున్నారు. సీరియస్ గా ఉన్నవారిని జైపూర్ లోని మరో హాస్పిటల్ కు రిఫర్ చేశారు. వారిలో 25 సంవత్సరాలు ఉన్న వ్యక్తి తప్పా మిగితావారందరూ 14సంవత్సరాల లోపు వారే ఉన్నారు. ఓ పిల్లాడికి లోక్ సభ స్పీకర్, కోటా ఎంపీ ఓం బిర్లా ప్రమాదంపై స్పందించారు. చిన్నారులకు మెరుగైన ట్రీట్మెంట్ అందించాలని డాక్టర్లను ఆదేశించారు. రాజస్థాన్ మంత్రి హీరాలాల్ నగర్ మాట్లాడుతూ.. ఇది చాలా బాధాకరమైన సంఘటన, ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు, ఒకరికి 100? కాలిన గాయాలు ఉన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరి నిర్లక్ష్యమైన ఉంటే విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## మహిళా దినోత్సవ కానుక

## సిలిండర్‌పై వంద తగ్గించిన మోడీ

గత తొమ్మిదేండ్లు గా అధికారంలో ఉన్న కాషాయ పాలకులకు గతంలో ఇలా ఎందుకు ఆలోచించలేదని ఆమె ప్రశ్నించారు. ఎన్నికలు ముంచుకొచ్చినప్పుడే వారికి గ్యాస్ ధరల భారం గుర్తుకువచ్చిందా అని నిలదీశారు. తమ ప్రభుత్వ హయాంలో గ్యాస్ సిలిండర్ కేవలం రూ. 430కే లభించేదని గుర్తుచేశారు. గత ఏడు నెలలుగా గ్యాస్ ధరలను ఎందుకు తగ్గించలేదని, ఎన్నికలకు ముందు ఇప్పుడే ఇలా ఎందుకు చేశారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే కేంద్రాన్ని నిలదీశారు. బీజేపీ తెలివైన పార్టీ అని వారు రూ. 395 విలువైన సిలిండర్లను రూ. 1000కి విక్రయిస్తూ ఇప్పుడు ప్రధాని మోదీ దాన్ని రూ. 100 తగ్గించినట్టు ఆర్భాటంగా ప్రకటించారని కాంగ్రెస్ ప్రతినిధి సురేంద్ర రాజ్‌పుట్ వ్యాఖ్యానించారు. తృణమూల్ నేత సాఘరికా ఘోష్ సైతం గ్యాస్ ధరల తగ్గింపు ప్రకటించిన సమయాన్ని తప్పుపట్టారు. గత కొన్ని నెలలుగా మహిళలు వంట గ్యాస్ భారాన్ని మోయలేకున్నారని, గ్లోబల్ మార్కెట్‌లో ధర తగ్గినా దేశీ మార్కెట్‌లో తగ్గించలేదని, ఇప్పుడు ఎన్నికల ముందు రూ. 100 తగ్గించారని ఆమె పేర్కొన్నారు. భారత్‌కు ప్రధాన మంత్రి అవసరమని, ఎన్నికల మంత్రి అవసరం లేదని ఆమె దుయ్యబట్టారు.

### ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం

### జీవో 3 రద్దు చేయాల్సిందే

### ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,మార్చి8 (ప్రజా మంటలు):



ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం జరుగుతోందని జీవో 3 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఇందిరా పార్క్ వద్ద భారత్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భారత్ జాగృతి శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాక మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు పోలీస్ శాఖలో కల్పిస్తున్నామన్నారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, జీవో 3 తీసుకొచ్చి ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. జీవో 3 వల్ల మహిళలకు కేవలం 12 శాతం మాత్రమే ఉద్యోగాలు వస్తాయని, మహిళలకు అన్యాయం జరిగే ఈ జీవోపై అవసరం అయితే సుప్రీం కోర్టుకైన వెళ్ళాలని కవిత పిలుపుపిచ్చారు. మహిళా వ్యతిరేక ప్రభుత్వంగా రేవంత్ రెడ్డి సర్కార్ మారుతోందన్నారు. పీజీటీ, జెఎల్ పోస్టుల్లో కూడా అన్యాయం జరుగుతోందన్నారు. ప్రజలను కలవటం లేదని కేసీఆర్‌ను విమర్శించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు ప్రజలకు కనడపడం లేదని ప్రశ్నించారు. ఆయన ఢిల్లీ నేతలనే కలుస్తారని.. ఇక్కడ ప్రజలను కలవరని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సం రోజు ధర్నా చేయాల్సి రావడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సంతోషంగా సంబురాలు చేసుకునే ఉమెన్స్ డే రోజున ఆడబిడ్డల ఉద్యోగాలకై ధర్నాలు చేసే దౌర్భాగ్యపు స్థితిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ మహిళలకు అనేక హక్కులు కల్పించారని చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 33 శాతం రిజర్వేన్‌ను పెంచుకున్నామన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లక్షకుపైగా ఉద్యోగాలు కల్పించుకున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల విషయంలో మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో వ్యక్తిగతంగా చనిపోయిన ఆడబిడ్డలను అడ్డుపెట్టుకుని రేవంత్ రెడ్డి రాజకీయం చేశాడని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో దొరికిన వ్యక్తి మహిళల ఉద్యోగాల విషయంలో కోత విధించారన్నారు. వికలాంగులు, మహిళలకు తోడు ఉండకుండా ఎవరికి తోడు ఉంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మహిళలను కాస్త ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగే ఏ ఒక్క కార్యక్రమం బీఆర్ఎస్ చేయలేదని వెల్లడించారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లలకు వ్యతిరేకంగా జీవో 3 తెచ్చిందని విమర్శించారు. ఈ జీవో వల్ల ఉద్యోగాల్లో అమ్మాయిలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఈ జీవోను రద్దుచేసి, హైకోర్టులు పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలతో ముందుకువెళ్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలకు వ్యతిరేకంగా ఏ నిర్ణయం తీసుకున్నా నిలదీస్తామని స్పష్టం చేశారు. జీవో 3 వల్ల గురుకులాల్లో మహిళలకు 12 శాతం ఉద్యోగాలే వచ్చాయన్నారు. తనకే అన్ని చట్టాలు తెలుసున్నట్టు సీఎం రేవంత్ వ్యవహరిస్తారని చెప్పారు. మహిళలకు 33 శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెడుతున్నారని విమర్శించారు.

# ఐటిడిఎ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం

## అమలు కోసం పెరుగుతున్న డిమాండ్

ములుగు,మార్చి8 (ప్రజా మంటలు): ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిషు మీడియం పాఠశాలలను నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖ భావించినా..అది పట్టాలకు ఎక్కలేదు. గతంలో ఇంగ్లీష్ మీడియం ప్రాంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి ఇంగ్లిషు బోధన జరపాలని యోచించారు. ఆ మేరకు కసరత్తు చేస్తున్నారని ప్రకటించారు. కానీ అడుగుకూడా ముందుకు పడలేదు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఈ విషయంలో పట్టుదల చూపాల్సి ఉంది. గిరిపుత్రులకు విద్యారంగంలో చేయూత అందించాలని గిరిజనులు కోరుతున్నారు. గిరిజన ఆవాస ప్రాంతాల్లో ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం కొనసాగించాలని డిమాండ్ ఉంది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలో 104ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంగ్లిషు బోధనపై మెళకువలు, అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇవ్వాలని గతంలో నిర్ణయించారు.గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఇంగ్లిషు బోధన జరగనుందని అట్టహాసంగా ప్రకటించారు. ఇందుకోసం ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు అవసరమైన మెటీరియల్ సమకూర్చడంతో పాటు ఆడియో, వీడియో ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. రెండు జిల్లాల పరిధిలో ఈ మేరకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. అయితే ఇవేమీ సాకారం కాలేదు. సరికదా ఉన్న పాఠశాల్లోనే సక్రమమైన వసతులు లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లిషు మీడియం పాఠశాలలు లేకపోవడంతో విద్యార్థుల కనీసం బేసిక్ అవగాహన కూడా నేర్చుకోలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా తెలుగు మీడియంలో నడుస్తున్న పాఠశాలలను ఇంగ్లిషు మీడియం పాఠశాలలను మార్చాలన్న డిమాండ్ ఉన్న తెలిసిందే. ఒకటవ తరగతి నుంచి ఇంగ్లిషు మీడియం పాఠశాలలను నడిపేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ద్వారా ప్రైవేట్ పోటీని తట్టుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లిషు మీడియం అందుబాటులో లేకపోవడంతో అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చేర్చి ఏటా లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించి చదివిస్తున్నారు. ఈ డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సి ఉంది.

## ఉమ్మడి జిల్లాలో పోటెత్తిన భక్తులు

వరంగల్,మార్చి8 (ప్రజా మంటలు): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ఆలయాలకు శివరాత్రి శోభ సంతరించుకుంది. శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. కొన్ని ఆలయాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సౌకర్యాలు చేశారు. హనుమకొండలోని వేయిస్తంభాలగుడి, కాజీపేట మడికొండలోని మెట్టుగుట్ట, వరంగల్లోని భద్రకాళి ఆలయం, కాశీబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయం భక్తులతో రద్దీగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామప్పలోని రామలింగేశ్వర క్షేత్రం, మహబూబాబాద్ జిల్లా కురవి వీరభద్రుడి సన్నిధి, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమ తీరం, కాళేశ్వర ముక్తీశ్వర సన్నిధానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగుతున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో శివరాత్రి వేడుకలు

## శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

## నదీతీరాల్లో పుణ్యస్నానాలు..ఆలయాల్లో అభిషేకాలు

హైదరాబాద్,మార్చి8(ప్రజా మంటలు):
తెలుగు రాష్ట్రాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శివనామస్వరంతో ఆలయాలన్నీ మార్మోగాయి. గోదావరి, కృష్ణానదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. వేములవాడ, కాళేశ్వరం, వేయిస్తంభాల గుడి, రామప్ప,శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ, వేములవాడ, కీసర ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఓం నమశ్శివాయా అనే మంత్రాక్షరితో కీసరగుట్ట దేదీప్యమానంగా వెలిగిపోతోంది. భక్తులు ఓం నమశ్శివాయా అంటూ శివుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు ఉదయం నుంచే శివాలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మంత్రులు ఆయా ఆలయాల్లో పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఓం నమఃశివాయ నామ స్వరణతో భక్తులు శివయ్యను దర్శించుకున్నారు.రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం అర్థరాత్రి నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేసి భక్తులకు మహాలఘుదర్శనం కల్పిస్తున్నారు. రాజరాజేశ్వర స్వామి వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం పట్టు వస్త్రాలు సమర్పించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శివరాత్రి శోభ సంతరించుకుంది. శైవక్షుత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వేయిస్తంభాల దేవాలయం, కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. నల్లగొండ జిల్లాలోని శైవక్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చెర్వుగట్టు, పానగల్, వాడపల్లి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. నిజామాబాద్ జిల్లాలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లాలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, బోధన్ ఏకచక్రేశ్వరాలయం, ఆర్మూర్ సిద్ధులగుట్ట ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగు తున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా చెన్నూరు, గూడెం, లక్సెట్టిపేట, మంచిర్యాల, వేలాల గోదావరి ఘాట్ల వద్ద వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ధర్మపురి, బాసరలో గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో దర్శనం చేసుకున్నారు. వేలాల మల్లిఖార్జునస్వామి ఆలయం, కత్తెరశాల మల్లన్న, బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో శివరాత్రి శోభ సంతరించుకుంది. బాసర, సోన్, బ్రహ్మపురి వద్ద గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. శైవ క్షేత్రాల్లో భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. కదిలి పాపహరేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొమురం భీం జిల్లాలో మహాశివరాత్రి సందర్భంగా వాంకిడి శివకేశవ ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఈజ్ గాం శివమల్లన్న జాతరకు భక్తులు భారీగా తరలి వచ్చారు. సూర్యాపేట జిల్లాలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పిల్లలమర్రి, నాగులపాటి అన్నారంలోని ప్రాచీన శివాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మేళ్లచెరువు శ్రీస్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల జిల్లాలో మహాశివరాత్రి సందర్భంగా అలంపూర్ ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. కీసర గుట్టలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారిని దర్శించు కునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భద్రాద్రిలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అన్నపురెడ్డిపల్లి, మోతె వీరభద్ర స్వామి, పాల్వంచ రామలింగేశ్వర ఆలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులతో పోటెత్తాయి. తీర్థాల సంగమేశ్వరాలయం, కూసుమంచి గణపేశ్వరాలయం, పెనుబల్లి నీలాద్రీశ్వరాలయం, బేతుపల్లి గౌతమేశ్వరాలయాల్లో భక్తుల రద్దీ కొనసా గుతోంది. సంగారెడ్డి జిల్లాలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులు శైవక్షేత్రాలకు తరలివెళు న్నారు. కోరిన కోర్కెలు తీర్చే ఆ మహాదేవున్ని తనివితీరా దర్శించుకున్నారు. జిల్లాలో ప్రముఖ ఆలయమైన కేతకీ సంగమేశ్వరా లయంలో భక్తుల రద్దీ పెరిగింది.

# వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ,మార్చి8(ప్రజా మంటలు):
వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారికి దర్శనం కోసం భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు.దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనాలను అందించారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇవో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శివరాత్రి వేడుకలు

నల్లగొండ,మార్చి8(ప్రజా మంటలు):
ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పిల్లలమర్రి, నాగులపాటి అన్నారం, మెళ్లచెర్వు శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నల్గొండలోని పురాతన ఛాయా, పచ్చల సోమేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సూర్యాపేట పిల్లలమర్రి, మేళ్ల చెర్వు స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొంది. చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వర స్వామి, వాడపల్లి ఆగస్తేశ్వర స్వామి దేవాలయాలల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

## తెలంగాణ భవన్‌లో మహిళాదినోత్సవ వేడుకలు

హైదరాబాద్,మార్చి8(ప్రజా మంటలు):
హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ఆడబిడ్డలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చేశారని తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, రుద్రమదేవిలా మహిళలు పోరాటం చేయాలన్నారు.

# ఉద్యోగలుకు జీతాలు ఇవ్వాలని కోరా

## వద్దని కోరినట్లు దుష్ప్రచారం తగదు - సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ట్వీట్

హైదరాబాద్,మార్చి8(ప్రజా మంటలు):
ఉద్యోగులకు జీతాలు ఇవ్వడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు కొందరు దుష్ప్రచారం చేస్తుండటం బాధాకరం అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను అని ఆయన ట్వీట్ చేశారు. తన ప్రసంగాన్ని తప్పు అర్థం వచ్చేలా ప్రచురించిన ఆ మీడియా సంస్థకు రిజాయిండర్ పంపించి, వార్తను సరిచేయించడం జరిగింది. అయినా కొందరు కావాలని ఉద్యోగులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్దిపొందే ప్రయత్నం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు.ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామనే ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పదే పదే నిలదీస్తూ వస్తున్నాను. అసెంబ్లీ సాక్షిగా ఉద్యోగుల పక్షాన గొంతెత్తాను. ఎల్లపుడూ ఉద్యోగుల హక్కులకోసం అండగా నిలిచే నా పై కొందరు కావాలని చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రభుత్వ ఉద్యోగులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను అని హరీశ్‌రావు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఈ సందర్భంగా తాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. ఉద్యోగులకు సంబంధించి నాలుగు కరువు భత్యాలు విడుదల చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులకు ఎంఎ÷-లాయ్ హెల్త్ స్కీమ్ అమలు చేయాలి. పీఆర్సీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ఖమ్మంలో నకిలీనోట్ల కలకలం

ఖమ్మం,మార్చి8 (ప్రజా మంటలు):
ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారంలో నకిలీ నోట్లు కలకలం రేపుతున్నాయి. అర్ధరాత్రి సమయంలో కిష్టారం పెట్రోల్ బంక్ లో 5 వేల రూపాయల డీజిల్ కొట్టించుకొని గుర్తు తెలియని వ్యక్తులు పది రూ.500 నకిలీ నోట్లు ఇచ్చారు. వాటిని సిబ్బంది గుర్తించి వెంటనే కారును పట్టుకునేందుకు ప్రయత్నించడంతో సదరు వ్యక్తులు అక్కడి నుంచి కారుతో పరారయ్యారు. ఆ కారు ఖమ్మం వైపు నుంచి వచ్చిందని సిబ్బంది చెబుతున్నారు. బంకు సిబ్బంది ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నీలోఫర్‌లో ఆధునీకరించిన ఐసియూ

## రోటరీ సంస్థను అభినందించిన మంత్రి సీతక్క

హైదరాబాద్,మార్చి8(ప్రజా మంటలు):



ప్రాణదానం చేసే దేవాలయం లాంటి నిలోఫర్ ఆస్పత్రికి సహకారం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయం అని మంత్రి సీతక్క అన్నారు. నిలోఫర్‌లో నవజాత శిశువుల చికిత్స కోసం ఆధునికీకరించిన ఐసీయూను సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ. 50 లక్షలు వెచ్చించి ఐసీయూ ఆధునికీకరణకు సహకరించిన రోటరీక్లబ్‌ను అభినందించారు. కరోనా కాలంలో రోటరీక్లబ్ సేవలను తమ ఏజెన్సీ ప్రాంతప్రజల అవసరాల కోసం ఉపయోగించుకున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, వైద్యులు వాణి, జ్యోతి రోటరీక్లబ్ మావెరిక్స్ అధ్యక్షురాలు వనశ్రీ, కార్యదర్శి దేశిని లక్ష్మీనారాయణ, రోటరీ గ్లోబల్ విజార్డ్ శ్రీవర్ధన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద లావాదేవీలపై కన్నేయండి

## బ్యాంకర్లకు కమిషనర్ సూచన

హైదరాబాద్,మార్చి8(ప్రజా మంటలు):
అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ బ్యాంకర్లకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో విడుదలయ్యే అవకాశమున్న నేపథ్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు అధికారులు, నగదు రవాణా ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ.. పారదర్శక, ప్రలోభరహిత ఎన్నికల నిర్వహణకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. నగదు రవాణా సమయంలో సరైన పత్రాలు లేని ఏజెన్సీలు, బ్యాంకు కో ఆర్డినేటర్ల వాహనాలను సీజ్ చేస్తారన్నారు. ఒకే రోజు ఏ ఖాతాదారుడైనా రూ.లక్ష డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసినా, రూ.10 లక్షల నగదు బదిలీ చేసినా.. ఆ వివరాలను అందించాలని సూచించారు. రూ.10 లక్షలకు పైబడిన లావాదేవీల వివరాలు ఆదాయపు పన్ను శాఖ అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

# మార్చి 25న దేశవ్యాప్తంగా బీజేపీ ప్రచారం

## ఎన్నికల సభలతో పాటు రోడ్ షోలు నిర్వహణ

## నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసిన బీజేపీ

న్యూఢిల్లీ,మార్చి8(ప్రజా మంటలు):
మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ పావులు కదుపుతోంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తోన్న ప్రధాని మోదీ విపక్షాలపై తనదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. ఇక రానున్న లోక్ సభ ఎన్నికల శంఖారావాన్ని ప్రధాని మోదీ హెూలీ తర్వాత మార్చి 25న దేశవ్యాప్తంగా ప్రచారం ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా మోదీ ఎన్నికల సభలతో పాటు రోడ్ షోలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 150 ఎన్నికల సభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అటు దక్షిణ భారతదేశంలో 35 నుంచి 40 సభలు, సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికలను రూపొందించారు. అటు అస్సాంలో 1 లేదా 2 సభలుకు బీజేపీ ప్లాన్ చేసింది. ఇక ఉత్తర్ ప్రదేశ్‌లో 15కు మించి సభలు, రోడ్ షోలు ప్లాన్ చేశారు. ప్రధాని మోదీ వారణాసి నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో నామినేషన్ దాఖలు చేసే రోజు రోడ్ షో నిర్వహించనున్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని కాన్పూర్, లక్నో, గోరఖ్‌పూర్, వారణాసి, ఝాన్సీ, ప్రయాగ్‌రాజ్, మొరాదాబాద్, మీరట్, బరేలీ, ఆగ్రాలలో ప్రధాని మోదీ భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నారు.ఇక మోదీతో పాటు హెూంమంత్రి అమిత్ షా, సీఎం యోగి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యూపీ సహా దేశవ్యాప్తంగా సభల్లో పాల్గొననున్నారు. అటు మధ్యప్రదేశ్‌లో సీఎం మోహన్ యాదవ్ ప్రచారాన్ని ముందుండి నడిపించనున్నారు. ఇక అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వ శర్మతో పాటు ఎంపీ సీఎం ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌లో ప్రచారం నిర్వహించనున్నారు.

# ఉద్యోగాల పేరుతో రష్యా మోసం

## ఉక్రెయిన్‌తో యుద్దానికి యువకుల తరలింపు

## అప్రమత్తం చేసిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,మార్చి8(ప్రజా మంటలు):
మంచి జీతం అనగానే ట్రావెల్ ఏజెంట్ మాటలు నమ్మి హైదరాబాద్‌కు చెందిన అస్ఫాన్.. రష్యాలో ఉద్యోగం కోసం వెళ్లాడు. తీరా అక్కడికి వెళ్లాక బలవంతంగా సైన్యం చేర్పించారు. ఆపై ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఆ యువకుడు ప్రాణం విడిచాడు. రష్యాలో ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మానవ అక్రమరవాణాను గుర్తించిన కేంద్రం.. తాజాగా కీలక ప్రకటన చేసింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో భారతీయులు పలువురు చిక్కుకున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. 'రష్యాలో ఉద్యోగాల పేరుతో భారీ మోసాలు జరుగుతున్నాయి. ఉద్యోగాల పేరిట ప్రైవేట్ సైన్యంలో చేరుస్తున్నారు. అలాంటి వాళ్లను గుర్తించి వెనక్కి రప్పించే ప్రయత్నంలో ఉన్నాం' అని విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో ఈ మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్ గుర్తించినట్లు తెలిపింది కేంద్రం. మోసకారి మాటలతో రష్యా ప్రైవేట్ సైన్యంలో భారతీయుల్ని చేరుస్తున్న ఏజెంట్లను సీబీఐ గుర్తించిందని.. పలువురిపై కేసులు కూడా నమోదు చేసిందని కేంద్రం తెలిపింది. రష్యాలో ఉద్యోగాల పేరిట.. ఏజెంట్ల ఇచ్చే మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దంటూ అప్రమత్తం చేసింది కేంద్రం. ఈ ముఠాలు 35 మంది భారతీయుల్ని రష్యాకు తరలించినట్లు తెలుస్తోంది. అయితే ఇందులో ఎంతమంది ఉక్రెయిన్ యుద్ధంలో ఉన్నారన్నది స్పష్టత రావాల్సి ఉంది.

## సమ్మక్క-సారక్క తాత్కాలిక ట్రైబల్ యూనివర్సిటీ ప్రారంభం

## ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

## పాల్గొన్న రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపీ మాలోత్ కవిత

ములుగు,మార్చి8(ప్రజా మంటలు):
ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం ముందుకు కదిలింది. ఇటీవల బడ్జెట్‌లో రూ.900ల కోట్లు కేటాయించిన కేంద్రం వచ్చే విద్యా సంవత్సరం నుంచే క్లాస్‌లు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. అలాగే తాత్కాలికంగా తరగతుల నిర్వహణ కోసం ములుగు మండలం జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను కేటాయించింది. దీంతో వైటీసీలో తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమ్మక్క %--% సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్‌కి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జాకారంలో సమ్మక్క సారక్క తాత్కాలిక ట్రైబల్ యూనివర్సిటీ ప్రారంభించుకోవడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. 335 ఎకరాలకు గాను,50 ఎకరాలు ఇంకా భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. పూర్తిస్థాయిలో భూసేకరణ కాగానే యూనివర్సిటీ భవనాల శాశ్వత నిర్మాణం చేపడతామన్నారు. సమ్మక్క సారక్క సెంట్రల్ యూనివర్సిటీకి హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీ మెంటర్‌గా పనిచేస్తుందన్నారు. భూసేకరణ పూర్తికాగానే దేశ ప్రధానిని, రాష్ట్ర ముఖ్యమంత్రిని పిలిచి సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీకి భూమి పూజ చేపిస్తామన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ప్రాంతంలో ఉండడం ఈ ప్రాంత వాసులు చేసుకున్న అదృష్టమన్నారు. ఆర్కియాలాజికల్ డిపార్ట్మెంట్ ద్వారా 7 కోట్ల రూపాయలుతో పాటు, రాష్ట్ర ప్రభుత్వానికి టూరిజం డిపార్ట్మెంట్ ద్వారా 60 కోట్ల రూపాయలు అప్పగించి అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీలో 35 శాతం సీట్లు గిరిజనులకు కేటాయించేలా చూస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.అనంతరం రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్ర మహిళలందరికీ మహిళా దినోత్సవ, మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. 2014లో యూనివర్సిటీ చట్టం విభజన బిల్లు పెట్టడం జరిగిందన్నారు. దాదాపు 900కోట్ల రూపాయలు గిరిజన యూనివర్సిటీకి కేటాయించి ప్రారంభించడం చాలా గొప్ప విషయమన్నారు. దేశ ప్రధాని సమ్మక్క-సారలమ్మ తల్లులతో పేరుతో యూనివర్సిటీ ప్రారంభించడం సంతోషదాయకమని హర్షం వ్యక్తం చేశారు. రాజకీయాలకతీతంగా ములుగు జిల్లా అభివృద్ధికి కేంద్రం సహకరించాలని మంత్రి కోరారు. గిరిజన యూనివర్సిటీలో గిరిజనులకు 35శాతం సీట్లు కేటాయించడం సంతోషమన్నారు.

# భారత్-చైనా పశ్చిమ సరిహద్దులో సైన్యం మోహరింపు

## 10,000 మంది సైనికులను మోహరించిన కేంద్రం

న్యూఢిల్లీ,మార్చి8(ప్రజా మంటలు): చైనాతో వివాదాస్పద సరిహద్దును పటిష్టం చేసుకునేందుకు భారత్ సరికొత్త వ్యూహం రచించింది. భారత్-చైనా సరిహద్దులోని పశ్చిమ సరిహద్దులో 10,000 మంది సైనికులను సైన్యం మోహరించింది. అయితే దీనిపై ఆర్మీ అధికారులు అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఉత్తరాఖండ్ నుంచి హిమాచల్ ప్రదేశ్ వరకు చైనా సరిహద్దుల్లో ఈ సైనికులను మోహరించారు. భారత్-చైనా సరిహద్దులోని ఈ ప్రాంతంలో ఇప్పటికే 9000 మంది సైనికులు మోహరించారు.532 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును భారత సైనికులు మరింత సురక్షితంగా ఉంచనున్నారు. ఈ ప్రాంతం గత దశాబ్దంలో భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు మరియు అభివృద్ధిని చూసింది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని కూడా ప్రోత్సహించారు. 2020లో చైనాతో జరిగిన ఘర్షణలో కనీసం 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. భారత సైనికులు కూడా చైనాకు తగిన సమాధానం ఇచ్చారు. అయితే ప్రపంచంలో పరువు నష్టం జరుగుతుందనే భయంతో చైనా తన సైనికుల మరణాల సంఖ్యను వెల్లడించలేదు. ఈ సంఘటన తర్వాత 2021 సంవత్సరంలో చైనాతో సరిహద్దులో గస్తీ కోసం భారత్ అదనంగా 50,000 మంది సైనికులను మోహరించింది.ఈ సంఘటన నుండి భారతదేశం, చైనా సరిహద్దు ప్రాంతాల వెంబడి సైనిక సంబంధిత మౌలిక సదుపాయాలను పెంచాయి. మరిన్ని దళాలను మోహరించడంతో పాటు తమ సరిహద్దుల వెంబడి క్షిపణులు, విమానాలను మోహరించాయి. 2020లో మనం ఎదుర్కొన్న ఇలాంటి పరిస్థితినే మనం ఎదుర్కొనే అవకాశం ఉందని, అందుకే అన్ని వేళలా యాక్టివ్‌గా ఉంటామని భారత రక్షణ కార్యదర్శి గిరిధర్ అరమనే ఇటీవల చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైనికుల మనోధైర్యాన్ని పెంచడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. భారత్‌పై చెడు దృష్టి సారించే ఎవరికైనా తగిన సమాధానం ఇవ్వడానికి వారు సమర్థులు.. సిద్ధంగా ఉన్నారు. జపాన్‌లో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడుతూ.. భారత్‌తో సుదీర్ఘకాలంగా కుదుర్చుకున్న లిఖితపూర్వక ఒప్పందాలను చైనా అనుసరించడం లేదని అన్నారు. గాల్వాన్ ఘటనను ఆయన ప్రస్తావించారు. అదే సమయంలో దీనికి బాధ్యుడిని చేసింది.

## నర్సులు సేవలు సరిగా అందించాలి

## స్టాఫ్ నర్స్‌లకు మంత్రి టోపీలు ధరింప చేసిన మంత్రి

వరంగల్,మార్చి8(ప్రజా మంటలు):
వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మంత్రి కొండా సురేఖ శుక్రవారం పర్యటించారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఎంజీఎం ఆసుపత్రిలో నూతనంగా ఉద్యోగంలో చేరిన స్టాఫ్ నర్స్‌లకు మంత్రి టోపీలు ధరింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. నర్సింగ్ ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదల ఆసుపత్రికి వచ్చిన పేషంట్లకు అంకిత భావంతో సేవలు అందించాలని అన్నారు. కొంతమందికి వేతనాలు అందక ఇబ్బందులకు గురయ్యారని.. 10 సంవత్సరాల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఉద్యోగులను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా వరంగల్ జైలును కూలగొట్టిందన్నారు. ఆస్పత్రి పేరుతో భవనాలు నిర్మించి.. ఎంజీఎంకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. అప్పు తెచ్చి డబ్బు వృధా చేశారని విమర్శించారు. ఎవరైన ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు త్వరలోనే బయటకు తీస్తామన్నారు. ఎంజీఎం ఆసుపత్రి ని అన్ని రకాలుగా తీర్చిదిద్దుతామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## బిజెపి ముఖ్యనేతలతో మాధవీలత భేటీ

## హైదరాబాద్‌లో సహకరించాలని వినతి

హైదరాబాద్,మార్చి8 (ప్రజా మంటలు): హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత సైదాబాద్‌లో పార్టీ ముఖ్యనేతలను కలిశారు. అండగా నిలిచి పార్టీ విజయానికి సహకరించాలని ఆమె కోరారు. భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీలను నివాసాలకు వెళ్లి కలిశారు. డివిజన్ ముఖ్య నేతలను పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాధవీలతను సత్కరించారు. చాదర్‌ఘాట్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవిలతను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డితో కూడిన బృందం శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మోదీ గ్యారెంటీ పథకాలతో ప్రజల్లోకి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించి మాధవిలత విజయం కోసం తమ వంతు కృషి చేస్తానని వెల్లడించారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్,నాయకులు తుమ్మలపల్లి రమే?షరెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, మందడి సందీ?పరెడ్డి పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి రేసు గుర్రం కాదు.. గుడ్డి గుర్రం

## ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్,మార్చి8(ప్రజా మంటలు):
ంవంత్ రెడ్డి రేసు గుర్రం కాదని.. గుడ్డి గుర్రమని ఎమ్మెల్సీ కవిత విమర్శలు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోసారి విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి మూన్నెళ్ళ ముఖ్యమంత్రి అంటూ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయం, జీవో3ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద భారత్ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ముగిసింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళల వాటా మహిళకు రావాలని.. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పారన్నారు. ఒక అమ్మాయి చనిపోతే రాజకీయానికి వాడుకున్నారని మండిపడ్డారు. కోర్టు తీర్పు పేరు చెప్పి రేవంత్ రెడ్డి తప్పించుకున్నా రన్నారు. జీవో 3 నిజమైతే 30వేల ఉద్యోగాల్లో ఎంత రిజర్వేషన్లు అమలు చేశారని ప్రశ్నించారు. నిరుద్యోగులు కన్ఫ్యూజ్‌లో ఉన్నారన్నారు. నిరుద్యోగులకు కాంగ్రెస ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చరిత్రలో మహిళలతో పెట్టుకున్న వారు ఎవరు బాగుపడరని.. తమ పోరాటం మహిళలకే కానీ పురుషులకు అన్యాయం చేయాలని కాదన్నారు. హారిజాంటల్ పద్దతిలో రిజర్వేషన్ పద్ధతి అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# అవినీతి నేతల పీచమణచాల్సిందే !

ఢిల్లీ లిక్కర్ కేసు చాలా చిన్నది అంటూ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. కాళేశ్వరంలో అసలు అవినీతే జరగేలదని బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. ఎపిలో జగన్ అన్నిరంగాల్లో అవినీతికి తెరతీసారు. అయినా అవినీతికి తావులేకుండా అని మాట్లాడుతున్నారు. మిగతా రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో అవినీతి తారాస్థాయికి చేరింది. అవినీతి జరిగిందని చెబుతున్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిజెపి నేతలు ఇంచుమాత్రం కూడా చర్యలకు సిద్దంగా లేరు. అవినీతి నేతలను కాపాడుతూ వస్తున్నారు. ఇదో రకమైన అవినీతిగానే గుర్తించాలి. మోడీ అవినీతి చర్యలన్నీ కక్షసాధింపు చర్యలుగానే ఉన్నాయి. తనకు అనుకూలంగా లేని పార్టీల నేతల అవినీతినే భూతద్దంలో చూస్తున్నారు. తెలంగాణలో కెసిఆర్ , ఆయన కుటుంబ అవినీతి, జగన్ అవినీతిని పట్టించుకోవడం లేదు. మొత్తంగా దేశంలో ఇప్పుడు అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడుతున్నది కేవలం రాజకీయనేతలు మాత్రమే. వారే అవినీతిలో కూరుకుపోతున్నారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాజమందిరాలు నిర్మించుకోవడం, కోట్లు కూడబెట్టడం, అక్రమాలకు పాల్పడడం చూస్తున్నాం. ఇలా అక్రమ సంపాదనలో మునిగి తేలుతూ ఎన్నికల్లో డబ్బులు పెట్టి ఓట్లను కొల్లగొడుతూ అధికారం చేజారకుండా చూసుకుంటున్నారు. ఒకరని చెప్పడానికి లేదు. అన్నీ ఒకే తాను ముక్కలు. అక్రమాలపై నిలదీస్తే ..ఎదరుదాడి చేయడం అలవాటు చేసుకున్నారు. మోడీ అక్రమాల గురించి ఆధారాలు ఉంటే నిలదీయాల్సిందే. బిజెపి నేతల అక్రమాలు ఉన్నా నిలదీయాల్సిందే. సోషల్ మీడియా ప్రస్తుతం చురుకుగా ఉంది. చీమ చిటుక్కుమన్నా..కోడై కూస్తోంది.ఈ క్రమంలో ఎవరి అక్రమాలను వేలెత్తి చూపినా..వాటి నుంచి బయటపడేందుకు విచారణలను ఎదర్కోవాలి. కడిగిన ముత్యంలా బయట పడాలి. అంతేగానీ ఇడి,సిబిఐ,ఐటిలను తిడుతూ..అధికార పార్టీ బిజెపిపై దండెత్తడం ద్వారా లేదా, ఎదురుదాడి విమర్శలు చేయడం ద్వారా ఎవరు కూడా తమ అక్రమాలను కప్పి పుచ్చుకోవడం కుదరదు. గతేడాది కర్నాటకలో ఓ బిజెపి ఎమ్మెల్యే తనయుడు లక్షలు లంచంగా తీసుకుంటూ అడ్డంగా దొరికి పోయాడు. అక్కడ పర్సంటేజీ ప్రభుత్వం అన్న ప్రచారం రావడంతో ప్రజలు బిజెపిని ఓడించి వాతలు పెట్టారు. మీడియా ఏకి పారేసింది. బిజెపిని తూర్పారా బట్టింది. అలాగే ఎపి సిఎంగా ఉన్న జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని చేసిన అక్రమాలకు జైలులో ఉండివచ్చాడు. ఆ కేసులేమీ తొలగిపోలేదు. ఎప్పటికైనా విచారణ ఎదుర్కోవాల్సిందే. బెయిల్‌పై ఉంటూ పాలన చేస్తున్నారు. తెలంగాణలో కూడా కెసిఆర్ అవినీతి మర్రి ఊడలా పాకింది. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారు. వస్తున్న విమర్శలను పట్టించుకోలేదు. కేంద్రం కూడా చర్యలు తీసుకోలేదు. అందుకే ప్రజలు కెసిఆర్‌ను పక్కన పెట్టారు. అయినా ఇప్పటికీ మేకపోతు గాంభీర్యంతో కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇకపోతే లాలూ ప్రసాద్ యాదవ్, తృణమూల్ మంత్రులు, ఆప్ నేతలు అంతా కూడా అక్రమ సంపాదలో దొరికిన వారే. లిక్కర్ స్కామ్‌లో ఇంకా నేరం రుజువు కాలేదు.



అయితే ఆరోపణలు మాత్రమే వస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవితను విచారణకు పిలిస్తే తాను మహిళను అంటూ వాదిస్తున్నారు. సుప్రీంలో కేసు వేసి విచారణ నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయినా సిబిఐ మరోమారు విచారించేందుకు రంగం సిద్దం చేశారు. అయినంత మాత్రాన ఇడినో, సిబిఐనో విమర్శించడం తగదు. ఇలాంటి చర్యలతో కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని లొంగ తీసుకోవడం కుదరదని బీజేపీ తెలుసుకోవాలంటూ కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె అహంకారాన్ని బయటపెడుతున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగాడుతూనే ఉంటామని ప్రకటించిన నేపథ్యంలో..దానిని వదులుకోమని ఎవరూ చెప్పడం లేదు. దేశ అభ్యున్నతి కోసం గొంతెత్తాల్సిందే. బిజెపి అవినీతిని కూడా ఎండగట్టాల్సిందే. అయితే తమ అవినీతి గురించి మాత్రం మాట్లాడవద్దంటే కుదరదని కవితమ్మ తెలుసుకోవాలి. తనపై వచ్చిన కేసులను తెలంగాణతో ముడిపెట్టి.. తెలంగాణ తలవంచబోదని చెప్పడంలో



అహంకారం తప్ప అర్థం లేదు. తెలంగాణ యావత్తుకు కవిత ప్రతినధి ఏమీ కాదు. తెలంగాణ తలవంచదు కనకనే పోరాటం చేసింది. అందుకే కెసిఆర్ అహంకారన్ని దించేసింది. కేసులు ఎదుర్కోవడం వేరు..అధికార బిజెపిని నిలదీయడం వేరు. ఈ రెండు విషయాలు వేర్వేరని కవిత గుర్తించాలి. అవినీతి కేసులో విచారణ వేరు..రాజకీయ పోరాటం వేరు. లిక్కర్ స్కామ్ బయటకు వచ్చినప్పుడే కవిత అరెస్ట్ తప్పదన్న సంకేతాలు వచ్చాయి. నిజానికి లిక్కర్ స్కామ్ విచారణకు ..విమర్శలకు పొంతన లేదు. ఈ విషయం బిఆర్ఎస్ నేతలు మరోలా మాట్లాడుతున్నారు. నిజానికి కవిత తనకు ఎలాంటి సంబంధంలేదని..కడిగిన ముత్యంలా వస్తే తప్పులేదు.ఆమెకు జనం బ్రహ్మరథం పడతారు. నిజానికి ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు తెలుగు రాష్ట్రాలనే కాదు.. యావత్ దేశాన్నే కదిలిస్తోంది. ఇదే కేసులో ఏపీకి చెందిన వైఎస్ఆర్ సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఇప్పటికే అప్రూవర్‌గా మారారు. దీంతో ఏపీలో కూడా దీనిపై చర్చ సాగుతోంది. వైసీఆర్ సీపీ సైతం ఆచితూచి స్పందిస్తోంది. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ఇప్పటి వరకు ఈ అంశంపై స్పందించనేలేదు. నిప్పులేనిదే పొగరాదు. ఈ విషయం కవితకు తెలియంది కాదు. ఇప్పటికే ఈ కేసుల్లో అరెస్ట్ అయిన వారితో, విచారణను ఎదుర్కొంటున్న వారితో వివరాలను రాబట్టిన తరవాతన ఇడి కవితకు నోటీసులు ఇచ్చింది. ఇది గమనించి మాట్లాడాలి. ఇలా ఒక్క కవిత కేసే కాదు...కాళేశ్వరం, మిషన్ భగీరథ, చేపలు, గొర్రెల పథకాల్లో అవినీతి కంపు కొడుతోంది. అవినీతికి ఎవరు పాల్పడినా శిక్షార్హులే. అవినీతిని చీల్చి చెండాడాల్సిందే. అప్పుడే సమాజం బాగుపడుతుంది.



## ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్ పోస్టుల భర్తీ ఎప్పుడు?

అన్ని రకాల టీచర్ పోస్టులను భర్తీ చేసి బడి పిల్లలకు న్యాయం చేయాల్సిన పాలకులు అట్టి పనిని చేయకుండా గ్రామీణ విద్యార్థులకు తీవ్రమైన ద్రోహం చేస్తున్నారు.

విద్యావ్యవస్థలోఅన్ని మార్పులుతేవడానికి తెచ్చిన విద్యాహక్కు చట్టం, నూతనవిద్యా విధానాల లక్ష్యం నెరవేరడంలేదు. మూడు దశాబ్దాలకు పైగా ఆర్ట్, క్రాఫ్ట్ విద్యలనువిద్యార్థులకు దూరం చేశారు.

విద్యార్థి దశలోనే కళా, వృత్తివిద్యలు అత్యంత అవసరమని 2009 విద్యాహక్కు చట్టం చెబుతోంది. భారతీయ సాంప్రదాయ కళలతో పాటు నైపున్యాలను మెరుగు పరిచి మేకిన్ ఇండియాకుఊపిరి పోయాలని నూతన విద్యా విధానం కోరుతోంది.అయినప్పటికీ దీని అమలులో గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వనిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. కావాలని ఈ విద్యలపైనిర్లక్ష్యం చేస్తున్నట్లు స్పష్టంగా తేలిపోయింది.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే నూతన ఉపాధ్యాయుల నియామకాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ ఉపాధ్యాయుల పోస్టులను నియమకాలు చేపట్టకపోవడం విద్య హక్కు చట్టం నిర్వీర్యం చేస్తుంది. భారతీయ సంస్కృతులను సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించే విధంగామరియు విద్యార్థులలో సృజనాత్మక ను పెంపొందించే విధంగా కళలు ఉపయోగపడతాయి అదేవిధంగా విద్యార్థి యొక్క అంతర్గత ఒత్తిడిని దూరం చేసి మానసికప్రశాంతతనుకలిగిస్తాయి.విద్యార్థులలో ఇమిడి ఉన్న భావాలను బయటికి తీసుకొస్తారు. ఒక్క కళాత్మక రంగంఅనేక శాస్త్రాలను తనలో ఇముడుచుకుంటుంది విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధికి కలలు దోహదం చేస్తాయి అలాంటి కలలకు ప్రాణం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కళా ఉపాధ్యాయులను హైస్కూల్ లలో నియామకాలను చేపట్టకపోవడం తీవ్ర బాధాకరమైన విషయం. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ ఉపాధ్యాయుల కోర్సులను పూర్తి చేసి సుమారు 3 లక్షల మంది నిరుద్యోగులు నియమకల కోసం ఎదురుచూస్తున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నాము

-

రావుల రాజేశం
లెక్చరర్. కవి.రచయిత. వ్యాసకర్త సామాజికవేత్త.
ప్రధాన కార్యదర్శి తెలంగాణ సామాజిక రచయితల సంఘం
77801 85 674

## మహిళలపై అత్యాచారాలకు అడ్డుకట్ట ఏదీ?

### కఠిన చర్యలు తీసుకోవడంలో పాలకుల విఫలం



న్యూఢిల్లీ, మార్చి 8 (ప్రజామంటలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవా లను ఏటా జరుపుకుంటున్నా..వారి గురించి ఘనంగా చెప్పుకుంటున్నా దేశ వ్యాప్తంగా మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, హింస బాగా పెరిగాయి. ప్రతిరోజూ దేశంలో ఏదో ఒక మూల మహిళలపై అత్యాచారం, హింస, దాడులు, హత్యలు జరుగుతు న్నాయి. ఇండ్ల దగ్గర నుంచి వసతి గృహాల వరకు ఆడపిల్లలను లైంగిక అవసరాలకు వాడుకొనే వికృత స్థితి వ్యాపించింది. అత్యాచారం, అక్రమ రవాణా, హత్యలు సాధారణ విషయాలైపోతున్నాయి. దేశంలో నెలకొన్న పరిస్థితులు మహిళలు, పిల్లల జీవితాలకు భద్రత లేకుండా చేస్తున్నాయి. దేశంలో మహిళలు, బాలికలు ముఖ్యంగా దళిత బాలికలపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. పని ప్రదేశాల్లో శ్రామిక మహిళలు వివక్ష, వేధింపులకు గురవుతు న్నారు. మహిళలకు సమాన హక్కులు, శ్రమకు గుర్తింపు, సమాన వేతనాలు, సమాన హక్కుల కోసం, మహిళలపై అత్యాచారాలు, హింసను అరికట్టడం, నేరస్థులకు కఠిన శిక్షలు అమలు చేయడంలో విఫలమైనందకు పాలకులు సిగ్గు పడాలి. మహిళలపై హింసకు పాల్పడ్డవారిని శిక్షించటానికి బదులు, ఇటువంటి ఆంక్షలతో మహిళలకే శిక్ష విధిస్తున్నారు. బేటీపడావో,..బేటీ బచావో నినాదాం వినడానికే పరిమితం అయ్యింది. మహిళా సాధికారత గురించి చెప్పడమే తప్ప అవకాశాలు రావడం లేదు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం వచ్చి ఐదేండ్లు దాటిపోయినా కనీసం ప్రభుత్వ రంగంలోనైనా ఈ చట్టం సరిగ్గా అమలు కాకపోవటం అన్యాయం. ఒకప్పుడు మహిళ అంటే వంటింటికే పరిమితమన్న భావన అందరిలోనూ ఉండేది. కానీ నేడు ఎందులోనూ తీసిపోమంటూ మహిళామణులు ముందుకు దూసుకెళ్తు న్నారు. పలురంగాల్లో ప్రతిభను కనబరుస్తూ అద్భుతాలు సృష్టిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజకీయాల్లో రాణిస్తూ ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తున్నారు. అయినా చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు తదితర సమస్యలకు పరిష్కారం కరువైంది. ఇంటి పని, వంట పని, గృహ నిర్వహణ, పెద్దల, పిల్లల, సంరక్షణ, నీళ్ళు, వంట చెరుకు తీసుకురావటం మొదలైన పనులతో మహిళలు రోజు మొత్తం శ్రమిస్తున్నారు. భారతదేశంలో మహిళలు తమ ఇల్లు, పిల్లలు, పెద్దల కోసం చేస్తున్న జీతభత్యంలేని శ్రమ విలువ కట్టలేం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని రైతు, వ్యవసాయ, గ్రామీణ కార్మికకుటుంబాల్లోని స్త్రీలు వీటితో పాటు పశువుల పెంపకం, వ్యవసాయ పనులు కూడా చేస్తారు. మంచినీరు, వంటచెరకు, పిల్లలు, వృద్దుల సంరక్షణా కేంద్రాలు, ఆరోగ్య వసతులు అందుబాటులో లేకపోవడంతో ఈ మొత్తం బాధ్యత, పనులు ఆడవారి మీదే పడుతున్నాయి. ఇన్ని బాధ్యతలు మోస్తున్నా వారిని మనం పనివస్తువుగా చూడడం సిగ్గుచేటు. రావటంతో వారి సమయం, శక్తి మొత్తం ఈ వేతనం లేని శ్రమకే వెచ్చిస్తున్నారు. ఇటువంటి వేతనంలేని సంరక్షణ పనుల కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు రోజులో 5 గంటలకుపైగా వెచ్చిస్తున్నారు. వీటన్ని టితో పాటు పని ప్రదేశాలలో శ్రామిక మహిళలు వేతనాలు, సర్వీసు కండీషన్లు, గౌరవం, పదోన్నతుల విషయంలో తీవ్ర వివక్షకు, అవమానాలకు గురవుతున్నారు. పని భారం కారణంగా అత్యధిక మంది మహిళలు తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగాలు వదిలేస్తున్నారు. మన దేశంలో సగం మంది మహిళలలో అత్యధిక మంది సంరక్షణ, సేవ పనులు చేస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ, అనుబంధ పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు మొదలైన స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించటం లేదు. ఇక అత్యాచార దోషులను శిక్షించడానికి బదులు దోష లతో మననేతలు అంటకాగుతున్నారు. చివరికి 3,4 ఏండ్ల పసిపిల్లలను కూడా వదలటంలేదు. ఆడవారు ఏ రకమైన బట్టలు ధరించాలి, ఎవరితో మాట్లాడాలి, ఎక్కడికి వెళ్లాలి అనే విషయాలపై ఆంక్షలు విధిస్తున్నారు. ఇంటిని చక్క దిద్దుకుం టునే ఉద్యోగ భాధ్యతలు నిర్వహిస్తోంది. పొలంలోనే కాదు.. సమస్యలపై పోరాటల్లోనూ అగ్రభాగాన నిలుస్తోంది. రంగం ఏదైతేనేమీ అన్నింటా తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుత సమాజంలో రాజకీయాల్లోనూ మహిళలు రాణి స్తున్నారు. పొలిటికల్‌లో కీలకమైన పదవులను అలంకరిస్తూ శాసిస్తు న్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు పోతూ అన్ని రంగాల్లో ఉనికి చాటుతున్నారు. అయితే ఇప్పటికీ మహిళల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది.రోజురోజుకూ మహిళలపై వేధింపులు పెరిగిపోతున్నా మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం లేదు. తల్లి దండ్రులతో పాటు సమాజంలో ఆడ పిల్లలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ఈ వివక్షను పారద్రోలిన నాడే నిజమైన మహిళా దినోత్సవంగా గుర్తించాలి.

## అదుపు తప్పుతున్న నిత్యావసర ధరలు

### దిగుమతులతో రైతులకు దక్కని గిట్టుబాటు



న్యూఢిల్లీ, మార్చి 8 (ప్రజామంటలు): దేశంలో ప్రభుత్వాలు అచేతనంగా ఉన్నాయా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. ఈ దేశంలో ఏం జరిగినా పట్టించుకోని రీతిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నా యి. ప్రధానంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా.. ఎక్కడ లోపం ఉందో గుర్తించడం లేదు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. అయితే మార్కెట్లో మాత్రం ధరలు విపరీతంగా పరుగులు పెడుతున్నాయి. ఉల్లిపాయలకు గిట్టు బాటు ధరలు రావడం లేదని రైతులు ఆందోళన చేస్తున్నారు. దిగుమతుల కారణంగానే ఇలా జరుగుతోందని మహారాష్ట్రలో రైతులు ఆందోళనలకు దిగారు. ఉల్లిపాయలకు గగిట్టుబాటు ధరలు లేవని కర్నూలు జిల్లాలో ఆందోళనలు చేస్తూనే ఉంటారు. ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మిర్చికి గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు తదితర జిల్లాల్లో ఆందోళనలు చేస్తున్నా పట్టించు కోవడం లేదు. పసుపు ధరలు గిట్టుబాటు కావడం లేదని నిజామా బాద్ తదితర జిల్లాల్లో రైతులు ఆందోళన చేస్తున్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, దేశాని కి అసవర మైన ఉత్పత్తులను పెంచే ప్రయత్నాలు చేయడం లేదు. దేశంలో వరి విపరీతంగా సాగవుతున్నా బియ్యం ధరలు తగ్గడం లేదు. గిట్టుబాటు ధరలు లేవని రైతులు అంటుంటే మార్కెట్లో మాత్రం ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లోపం ఎక్కడో పాలకులు గుర్తించడం లేదు. ప్రజలకు నిత్యావసరాలను తక్కు వ ధరలకు అందించే ఏర్పాట్లు చేయడం లేదు. మన వ్యవ సాయ భూమలును మన ప్రజలకు అవసరమైన పంటలు పం డించేలా మార్చడం లేదు. దేశానికి సమగ్ర వ్యవసాయ విధానం లేకపోవడం వల్లనే ఇలాంటి



దుష్ఫలితాలు ఎదుర్కో వాల్సి వస్తోంది. గ్యాస్ ధరలను పెంచి వంటింట్లో అమ్మకు సెగ పెట్టారు. నిత్యావ సర ధరలు అందుబాటులో లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, యూరియా అందడం లేదు. పండిం చిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. మన నేలలు నూనెగింజలకు అనుకూలంగా ఉన్నా నువ్వులు, వేరుశనగ, కుసు మ, పొద్దు తిరుగుడు పంటలను ప్రోత్సహించడం లేదు. వీటిని ప్రోత్సహించి రైతులకు చేదోడు వాదోడు గా ఉండాల్సన ప్రభుత్వాలకు ప్రణాళిక లేకుండా పోయింది. అదే పనిగా దిగుమతుల మీద ఆధారపడడం ఎంతవరకు సమంజ సమో ఆలోచించాలి. కృత్రిమ కొరత సృష్టించి అందినకాడికి దండుకుం టున్నారు వ్యాపారులు. నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఈ విషయాలను సీరియస్‌గా తీసుకోవాలి. ప్రజలను దోచుకుంటున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినం

### జ్యోతిర్లింగ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు - ఉజ్జయినిలో సిఎం మోహన్ యాదవ్ పూజలు



న్యూఢిల్లీ, మార్చి 8 (ప్రజామంటలు): దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు మహా వేడుకగా జరుపుకున్నారు. దేశంలోని అన్ని శైవాలయాలు, జ్యోతిర్లింగాలు.. శివ భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఉజ్జయినిలోని మహాకాలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు చేశారు. ఆ ఆలయంలో ఇవాళ తెల్లవారుజామున భస్మహారతి నిర్వహించారు. ఆ తర్వాత మహాకాలుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారణాసిలోని కాశీ విశ్వనాథుడికి ఇవాళ ఉదయం ప్రత్యేక హారతి ఇచ్చారు. కాశీలో వేల సంఖ్యలో భక్తులు విశ్వనాథుడి దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు అయిదు కిలోమీటర్ల మేర అక్కడ భక్తులు క్యూ కట్టనట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఢిల్లీలోని గౌరీశంకర్ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. హరిద్వార్‌లోని ధాకేశ్వర్ మహాదేవ్ ఆలయం వద్ద భక్తులు భారీ క్యూలైన్ కట్టారు. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో త్రినేత్రుడి దర్శనం చేసుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు లక్షల సంఖ్యలో హాజరయ్యారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో ఉన్న జ్యోతిర్లింగ క్షేత్రమైన బాబా బైద్యనాథ్ ఆలయంలో కూడా భక్తులు కిటకిటలాడిపోయారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న అలువ మహాదేవ్ ఆలయానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గుజారాత్ లోని సోమ్‌నాథ్ ఆలయంలో వేకువజాము నుంచే అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. రామేశ్వరంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సముద్రస్నానాలు ఆచరించి శివుడి దర్శనం చేసుకు న్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న శివాలయాల్లో వేకువ జామునుంచే భక్తుల రద్దీ పెరిగింది. శ్రీకాళహస్తిలోని శివాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో ఆలయ దర్శనం కోసం వస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెల్లవారుజామున హనుమకొండ లోని వెయ్యి స్తంభాల గుడిలో పూజలు నిర్వహించారు. గ్వాలియర్‌లో ఉన్న అచలేశ్వర్ ఆలయంలో కూడా భక్తులు పెద్దగా ఎత్తున దర్శనాలు చేసుకున్నారు. ఏపీలోని శ్రీశైలంలో కూడా భారీగా పూజలు నిర్వహించారు.

## ఉమ్మడి మెదక్ జిల్లాలో శివరాత్రి మహోత్సవాలు

### ఏడుపాయల వనదర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు - పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే రోహిత్

మెదక్, మార్చి 8 (ప్రజామంటలు): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. సిద్ధిపేటలోని శైవ క్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. లింగోద్భవ సమయాన స్వామి వారికి ఆలయ అర్చకులు... మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. అర్థరాత్రి సమయాన ఆలయ తోటబావి వద్ద పంచవర్ణాలతో 42 వరుసలతో ఆలయ ఒగ్గు పూజరులచే పెద్ద పట్నం నిర్వహణ జరుగనుంది. పెద్దపట్నం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. అటు సంగారెడ్డి జిల్లా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఝరాసంగం కేతకి సంగమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక మహారాష్ట్ర భక్తులు తెల్లవారుజాము నుంచి భారీగా తరలివస్తున్నారు. తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన వందేళ్ల చరిత్ర గల ఏడుపాయల వనదుర్గామాత దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో జాతర ఘనంగా ప్రారంభమైంది. మేడారం తర్వాత అతిపెద్ద జాతరగా ఏడుపాయల జాతర ప్రసిద్ధి చెందింది. నేటి నుంచి 10 వరకు మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అక్కడి మంజీరా నదిలో పుణ్యస్నానమాచరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. జాతరలో భాగంగా ప్రభుత్వం తరపున దుర్గమ్మ తల్లికి ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావ్ దంపతులు, కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి పాలకమండలి సభ్యులు, వేద పండితులు పూర్ణకుంభం తో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావ్ మాట్లాడుతూ.. ఏడుపాయలను అభివృద్ధి చేస్తామన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో జాతర ఏర్పాట్లు చేశామని తెలిపారు. మూడు రోజుల పాటు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాతర విజయవంతం చేయాలని కోరారు.

## మహా శివరాత్రి వేడుకల్లో శ్రీ సంతాన నాగ శివ సుబ్రమణ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు..



ఇల్లందకుంట మార్చి 08 (ప్రజా మంటలు) :
ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామంలో శ్రీ సంతాన నాగ శివ సుబ్రమణ్య స్వామి వారి ఆలయం లో మహా శివరాత్రి వేడుకల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

## శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ వేడుకలు



జగిత్యాల మార్చ్ 8 (ప్రజా మంటలు) :
జగిత్యాల పట్టణంలో మంచినీళ్ళ భావి వద్ద గల రజక సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాలే ప్రధాన అర్చకులు సిరిసిల్ల పార్థసారథి శర్మ నేతృత్వంలో వైదిక క్రతువులు నంబి నరసింహాచారి (చిన్న స్వామి) ,రుద్రాంగి గోపాల కృష్ణ, సిరిసిల్ల రాధ కృష్ణ,శర్మ, భాస్కర్ శర్మ , కిరీటి శర్మ, కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి కళ్యాణ వేడుకలను ఘనంగా కొనసాగించారు. ఉదయము స్వామి వారి మూల విరాట్టుకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో ఉదయం నుండి బారులు తీరారు. భక్తులు స్వహస్తాలతో స్వామివారి మూలమూర్తికి పాలతో అభిషేకించారు. శివనామస్మరణతో ఆలయం అంతా మారు మోగింది. మూలమూర్తికి అలంకరించే ముక్కోటాను అధ్యక్షులు మతలాపురం శంకర్ నివాసం నుండి మంగళ వాద్యాలతో ఆలయానికి చేర్చి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. రజక సంఘం, పెద్దలు, కార్యకర్తలు ,బాధ్యులు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేశారు.

## ఆర్య సమాజ్ లో రుద్రయాగం



సికింద్రాబాద్, మార్చి 08 ( ప్రజామంటలు) : మహాశివరాత్రి పర్వదిన వేడుకలు బన్సీలాల్ పేట, బౌద్ధనగర్ డివిజన్ లల్లో శుక్రవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాలకు వెళ్ళి శివలింగ దర్శనం చేసుకొని, పూజలు చేశారు. ఉపవాస దీక్షలు, రాత్రి జాగరణ చేశారు. మేడిబావి లోని ఆర్య సమాజ్ లో ప్రతి ఏడాది లాగే ఈ సారి కూడ మహాశివరాత్రిని పురస్కరించుకొని 108 జంటలతో రుద్రయాగం, ఋషిబోధోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు శాస్త్రోక్తంగా యాగం నిర్వహించారు. ప్రెసిడెంట్ ఎం.ఆర్.రవీందర్, యగ్న బ్రహ్మలు బసంతరాణి, జయరాజ్ ఆర్య దంపతులతో పాటు ఆర్యసమాజ్ ప్రతినిధులు ఎం.అనుసూయదేవి, డా.కే.సుబ్బారావు, నర్సింగ్ రావు, అనురాజ్, కే.ఆర్. భానుప్రకాశ్, యశ్వంత్, పృథ్వీరాజ్, సతీష్ కుమార్, హనుమంతరావు, రామలక్ష్మీ, శైలజ, భక్తులు పాల్గొన్నారు.

## కొత్తకొండ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సేవలు అభినందనీయం



భీమదేవరపల్లి మార్చ్ 08 (ప్రజామంటలు) : మహాశివరాత్రి పర్వదినాన సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంకేతిక కారణాలవల్ల విద్యుత్ నిలిచిపోవడంతో కొత్తకొండ సబ్స్టేషన్ పరిధి విద్యుత్ సిబ్బంది, లైన్మెన్ రాజకుమార్ సకాలంలో స్పందించి విద్యుత్ ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఏఈ శిరీష్ కుమార్ మాట్లాడుతూ, నేడు కొత్తకొండ సబ్ స్టేషన్ పరిధిలో సుమారు గంటపాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు విద్యుత్ సిబ్బంది సేవలను అభినందించారు.

## శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే డా .సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు



జగిత్యాల మార్చ్ 8 (ప్రజా మంటలు) :
శివరాత్రి పర్వదినం సందర్భంగా జగిత్యాల పట్టణంలోని మడేలేశ్వర స్వామి వారిని దర్శించుకుని,స్వామి వారి కళ్యాణం లో పాల్గొని ప్రతేక పూజలు చేసిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ .వెంట బి అర్ ఎస్ పార్టీ నాయకులు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామినీ దర్శించుకున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



ధర్మపురి మార్చ్ 8 (ప్రజా మంటలు) : ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ .ఈ సందర్భంగా ఎమ్మెల్యే ని ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేసి, సత్కరించారు. వెంట డి సి ఎం ఎస్ ఛైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు వేములవాడ రాజేశ్వర స్వామి, పెంబట్ల దుబ్బ రాజన్న ప్రసాదం అందజేసిన జెడ్పి చైర్పర్సన్ దావ వసంత



హైదరాబాద్ మార్చి 8 (ప్రజా మంటలు) :
శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ శ్రీ రాజ రాజాజేశ్వర స్వామి మరియు పెంబట్ల దుబ్బరాజేశ్వర స్వామి వార్ల తీర్థప్రసాదాలను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అందజేసి, ఆ పరమశివుని ఆశీస్సులు కవితక్క పై ఎల్లపుడూ ఉండాలని జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ కోరుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



జగిత్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):
రామకృష్ణ డిగ్రీ మరియు పీజీ కళాశాల జగిత్యాల ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో రెండవ రోజులో భాగంగా ఉదయం స్థానిక పోరుమల్ల గ్రామంలో గల ఓంకారేశ్వర ఆలయంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని ఇట్టి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. తదుపరి మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో గవర్నమెంట్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓ పడాల తిరుపతి రెడ్డి పాల్గొని ఎన్ఎస్ఎస్ లో వాలెంటర్ల యొక్క పాత్రని సమాజంలో వాలంటీర్ల యొక్క పాత్రను వారి జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలను గుర్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోరు మల్ల మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి గుండ్లపల్లి మాజీ సర్పంచ్ సంపత్ మరియు మాజీ సింగిల్ విండో చైర్మన్ భూమా రెడ్డి వివిధ సంఘ నేతలు మరియు కళాశాల అడ్మిన్ స్టాఫ్ కే. భూమ రాజం, లైఫ్ సైన్స్ అధ్యాపకురాలు మానస, కెమిస్ట్రీ అధ్యాపకుడు ఎస్. రఘునాథ్, ఎన్ఎస్ఎస్ పిఓ లు జి. రాకేష్, ఎం.డి. అఫ్సర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

### -18 మంది విశిష్ట పెన్షనర్స్ మహిళలకు సన్మానాలు



జగిత్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):
తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన బోబ్బాటి కరుణ,ఏ.విజయ లక్ష్మి, హేమలత,,ప్రభావతి,తదితర 18 మంది కేంద్ర,రాష్ట్ర పెన్షనర్స్ మహిళలను తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,జిల్లా అంబుడ్స్ మెన్ అధికారి కృష్ణా రెడ్డి చేతుల మీదుగా సన్మానించారు ,అవార్డులు అందజేశారు.మహిళల హక్కులు,భాధ్యతలు అంశంపై కృష్ణా రెడ్డి,పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై హరి ఆశోక్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం,అసోసియేట్ అధ్యక్షుడు పి.సి.హన్మంత రెడ్డి, ఉపాధ్యక్షులు వెలుముల ప్రకాష్ రావు,ఎం.డి.యకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.ఆశోక్ రావ్, కె. సత్యనారాయణ, నాయకులు దిండిగాల విట్టల్, వనమాల సత్యనారాయణ, ఉప్పుగళ్ల మురళీధర్, దేవేందర్ రావు, ఎం.డి. యూసూఫ్, ఎక్బాల్, కొక్కు నారాయణ, దేవేందర్ రావు, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షుడు గంగాధర్, ధర్మపురి అధ్యక్షుడు కె. గంగాధర్, కేంద్ర పెన్షనర్స్ ప్రతినిధి సూర్యనారాయణ, విద్యుత్ పెన్షనర్స్ ప్రతినిధి లక్ష్మీపతి, ఆర్టీసీ పెన్షనర్స్ ప్రతినిధి కస్తూరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రామభక్తులు, ఆలయాల సందర్శనలు



కొడిమ్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రములో అయోధ్య బాల రాముని దర్శనం చేసుకుని వచ్చిన సందర్భ%శీ%గా కొడిమ్యాలకు చెందిన రామభక్తులు శుక్రవారం వివిధ ఆలయాలు సందర్శించి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, అయోధ్య రాముని ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అయోధ్య బాల రాముని దర్శనం చేసుకొని వచ్చిన రామ భక్తులు ఏనుగు ఆదిరెడ్డి, చెన్న దేవేందర్, మంచాల శ్రీనివాస్, కంచర్ల రామ స్వామీ, ఆలయ పూజారులు నాగరాజు శ్రీనివాసు, నాగరాజు రమేష్, భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగిగా దాసరి చంద్రశేఖర్



జగిత్యాల మార్చ్ 8 (ప్రజామంటలు): జిల్లా కేంద్రానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి దాసరి చంద్రశేఖర్ ఉత్తమ ఉద్యోగిగా ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా హైదరాబాద్లో అవార్డును అందుకున్నారు. ఇటీవల ముగిసిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో ఉత్తమ సేవలను అందించినందుకు గాను ఆర్టీసీ సెక్యూరిటీ విభాగంలో జగిత్యాల జిల్లాకు చెందిన దాసరి చంద్రశేఖర్కు ఈ అవార్డు దక్కింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి కానిస్టేబుల్ రమణ, హెడ్కానిస్టేబుల్ చంద్రశేకర్లకు అవార్డు దక్కింది. అవార్డుతో రూ.2వేల రివార్డును అందించారు. చంద్రశేఖర్ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు తీసుకోగా, ఆర్టీసీ డిపో మేనేజర్, ఇతర అధికారులు అభినందించారు.

# మహిళా దినోత్సవ ఘనత

### రాజ్యసభకు సుధామూర్తి - నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము

### శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ




న్యూఢిల్లీ,మార్చి8(ప్రజా మంటలు) :
ప్రముఖ విద్యావేత్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సతీమణి సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుధామూర్తిని ఎగువ సభకు నామినేట్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు సుధామూర్తికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ కావడం సంతోషకరమైన విషయమన్నారు. సామాజిక సేవలో సుధామూర్తిది స్ఫూర్తిదాయక ముద్ర అని కొనియాడారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్య సహా విభిన్న రంగాలకు సుధా జీ చేసిన కృషి అపారమైనదని ప్రశంసించారు. సుధామూర్తి లాంటి వ్యక్తి రాజ్యసభలో ఉండటం నారీ శక్తికి ఒక శక్తివంతమైన నిదర్శనం అని కొనియాడారు. ఎగువ సభకు నామినేట్ అయిన సుధామూర్తికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రపతి కోటాలో ఆమె పెద్ద సభలో అడుగు పెట్టబోతున్నారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్యతో సహా విభిన్న రంగాలకు సుధా మూర్తి చేసిన కృషి అపారమైనదని ప్రధాని మోదీ కొనియాడారు. మన దేశం విధిని రూపొందించడంలో మహిళల శక్తి, సామర్థ్యాన్ని ఉదాహరణగా చూపుతుందన్నారు. ఆమెకు ఫలవంతమైన పార్లమెంటు పదవీకాలం కావాలని ఆకాంక్షించారు ప్రధాని మోదీ. ఒక ఉపాధ్యాయురాలుగా ప్రస్థానం ప్రారంభించిన సుధామూర్తి ఇన్ఫోసిస్ ఫౌండేషన్ను ప్రారంభించారు. ఆమె భర్త ఎన్ఆర్ నారాయణ మూర్తి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు. సుధా మూర్తి రచయిత, దాతృత్వాన్ని నమ్ముతారు. 2006లో ఆమె చేసిన సామాజిక సేవకు గానూ ప్రభుత్వం భారతదేశపు నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీని అందుకున్నారు. 2023లో ఆమెకు భారతదేశపు మూడవ అత్యున్నత పౌర పురస్కారం పద్మ భూషణ్ కూడా లభించింది.

## ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ

### ఆదాయపన్ను శాఖ చర్యల నిలుపుదలకు నో

న్యూఢిల్లీ,మార్చి8(ప్రజా మంటలు) :
లోక్సభ ఎన్నికలు తరుముకొస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ అకౌంట్లపై ఆదాయం పన్ను శాఖ చర్యను నిలివేయాలని కోరుతూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్ను ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. అలాంటి ఉత్తర్వులు జారీ చేసే అధికారం తమకు లేదని స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ అకౌంట్లను స్తంభింప చేసి, బకాయిలు వసూలుకు ఐటీ శాఖ చర్యలు తీసుకోవడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఐటీ శాఖ చర్యను పది రోజుల పాటు సస్పెండ్ చేయాలని, ఈలోపు తాము హైకోర్టుకు వెళ్తామని ఐటీఏటీ కాంగ్రెస్ తరఫు న్యాయవాది వివేక్ తన్ఖా అప్పిలేట్ ట్రిబ్యునల్ను కోరారు. ఫిబ్రవరి 22న విచారణ సందర్భంగా ఆయన తన వాదనను కోర్టు ముందుంచుతూ, పార్టీ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని, ముఖ్యంగా ఎన్నికల ప్రచారానికి నిధులు అవసరమని తెలిపారు. అయితే ఈ వాదనను ఐడీ శాఖ తోసిపుచ్చింది. బకాయిల వసూలుకు తమ చర్య అవరోధం కాదని, ఆ పార్టీకి తగినన్ని నిధులున్నాయని చెబుతోంది. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు అకౌంట్లను ఐటీ శాఖ స్తంభింపచేసినట్టు కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకెన్ ఇటీవల ఆరోపించారు. రూ.210 కోట్ల బకాయిల పేరుతో తమ అకౌంట్లను స్తంభింపజేసినట్టు చెప్పారు. అయితే, బ్యాంకు అకౌంట్లను ఆపరేట్ చేసుకునేందుకు ఐటీఏటీ కాంగ్రెస్కు అనుమతి ఇచ్చినట్టు తన్ఖా ఆ తరువాత వివరణ ఇచ్చారు. ఐటీ శాఖ శాతం కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్ల లావాదేవీలను స్తంభింపజేయాలని తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేసింది.

## సోదరుడు తిరుపతిరెడ్డిని పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,(ప్రజా మంటలు) : గుండెపోటుతో మాదాపూర్ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరుడు తిరుపతి రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. తిరుపతి రెడ్డ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గురువారం తిరుపతిరెడ్డికి గుండెపోటు రావడంతో చికిత్స కోసం మాదాపూర్ మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. తిరుపతిరెడ్డికి యాంజియోగ్రామ్ చేసిన వైద్యులు.. గుండె రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నాయని గుర్తించారు. వెంటనే ఆయను స్టంట్స్ వేశారు. ప్రస్తుతం తిరుపతి రెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. రానున్న రోజుల్లో లోక్ సభ ఎన్నికల్లో మల్కాజ్ గిరి ఎంపీ అభ్యర్థిగా సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు అయిన తిరుపతిరెడ్డి పోటీ చేస్తారని గత కొన్ని రోజులుగా ప్రచారం సాగుతోంది. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ తిరుపతిరెడ్డి పేరుతో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఈ ప్రచారం ఊపందుకుంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ బాధ్యతలను తిరుపతి రెడ్డి చూసుకుంటున్నారు.అయితే ఎన్నికల్లో తన సోదరులు ఎవరూ పోటీ చేయరని సిఎం ఇప్పటికే ప్రకటించారు.

## ప్రాజెక్టులపై బిఆర్ఎస్ నేతల అవాస్తవాలు

### బండి సంజయ్ ఓడిపోయినా సవాళ్లేనా - మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా

హుస్నాబాద్,మార్చి8 (ప్రజా మంటలు) :
ప్రాజెక్టులపై వాస్తవాలు చెప్పేందుకు తాము ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు మాత్రం డిజిటల్ హంగులు ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర, ముత్తారం గ్రామంలోని కైలాస కళ్యాణి క్షేత్రం, త్రికూటేశ్వరాలయాలను ఆయన సందర్శించారు. అక్కడ శివాలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టులో నేడు నీళ్లు లేకుండా పోయాయన్నారు. రాష్ట్రంలో ఒక యాత్ర నిర్వహిస్తున్న నాయకుడు మమ్మల్ని నాస్తికులుగా పోలుస్తున్నాడని, దేవుని పేరుతో రాజకీయం చేసేది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఎంపీగా ఉండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయావని, రాజకీయ సన్యాసం తీసుకోవాల్సింది ఆయనేనని పరోక్షంగా బండి సంజయ్ను విమర్శించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల ప్రోగ్రాం ప్రారంభిస్తామన్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ.2కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటివరకు 26 కోట్ల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. ఫ్రీ జర్నీ కోసం నెలకు రూ.350 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సీఎంతో చెప్పి కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తామన్నారు. ఎలక్షన్ కోడ్ వచ్చేలోపే గతంలో ప్రకటించిన బాండ్స్ పేమెంట్స్ ఇష్యూ చేస్తామన్నారు.

## రంగాను చంపించింది చంద్రబాబే

### ఆనాడే ఈ విషయం అందరికీ తెలుసు - వైసిపి నేత పోసాని కృష్ణమురళి ఆరోపణ

హైదరాబాద్,మార్చి8(ప్రజా మంటలు) :
వంగవీటి రంగాను చంద్రబాబే చంపించారనే విషయం అందరికీ తెలుసని ఎఫ్డిసి ఛైర్మన్ పోసాని కృష్ణమురళి అన్నారు. ఐదు జిల్లాల్లో వంగవీటి రంగా అంటే.. ఆ రోజుల్లో ఎన్టీఆర్ కంటే గొప్పవాడని, అందుకే వంగవీటి రంగాను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. రంగా కారులో చిన్న కర్ర దొరికితే.. దాన్ని చూపించి రంగాను పీఎస్కు తీసుకెళ్లారని, తనను చంపేస్తారని రంగాకు కూడా ఒక స్టేజ్లో అర్థమైందని పోసాని తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని వంగవీటి రంగా నాడు రాజీవ్గాంధీకి లేఖ కూడా రాశారు. దీనిపై రాజీవ్ వేగంగా స్పందించారన్నారు. ఎన్టీఆర్ను మించిపోతున్నాడనే రంగాను హత్య చేయించారని పోసాని అన్నారు. 'నేనున్నానంటూ ఇప్పుడు పవన్ కల్యాణ్ పార్టీ పెట్టాడు. మీరు అండగా ఉంటే సీఎం అవుతానని పవన్ చెప్పాడు. రంగా తరహాలో పవన్ ఉంటాడని కాపులంతా భావించారు. చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణలను కూడా పవన్ తిట్టాడు. ఇప్పుడు చంద్రబాబు కోసం పనిచేస్తున్నాడు. తాను సీఎం కాలేనని పవనే చెబుతున్నాడు. చంద్రబాబుకే సీఎం అయ్యే అర్హత ఉందని పవన్ చెబుతున్నాడు. చంద్రబాబుకు కాపులందరూ ఎందుకు ఓటు వేయాలి' అంటూ పోసాని ప్రశ్నించారు.
'సలహాలు ఇచ్చేవారంతా వైఎస్సార్సీపీ కోవర్టులంటూ పవన్ చెబుతున్నాడు. ముద్రగడను చంద్రబాబు ఎంత వేధించారో అందరికీ తెలుసు. ముద్రగడను వేధింపునప్పుడు పవన్ ఎందుకు మాట్లాడలేదు. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు పవన్ గగ్గోలు పెట్టాడు. పవన్ తన వెనకాల నాదెండ్ల మనోహర్ను పెట్టుకున్నాడు. పవన్ తన గుండెల్లో మాత్రం చంద్రబాబును పెట్టుకున్నాడు. కాపులను తిట్టిన వారితో పవన్ ఇప్పుడు ఎందుకు కలిసాడు' అంటూ పోసాని కృష్ణమురళి నిలదీశారు.

## పార్లమెంటులో కూడా కేజ్రీవాల్ గళం

### ప్రచారాన్ని ప్రారంభించిన ఆప్

న్యూఢిల్లీ,మార్చి8(ప్రజా మంటలు) :
రానున్న లోక్సభ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారాన్ని షురూ చేసింది. 'సంసద్ మే బీ కేజ్రీవాల్, తో ఢిల్లీ హోగీ ఔర్ ఖుష్ హాల్' నినాదంతో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని 'చీపురు' పార్టీ లోక్సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. 4:3 ఫార్ములా సీట్ల షేరింగ్తో కాంగ్రెస్తో పొత్తు పెట్టుకుని ఢిల్లీ లోక్సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఆప్ గతంలో ప్రకటించింది. ఢిల్లీలో సీఎం అరవింద్ కేజ్రీవాల్తో పాటు పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తల సమక్షంలో ప్రచారాన్ని ప్రారంభించారు. 'నా కుటుంబ సభ్యులైన ఢిల్లీ ప్రజలకు సేవ చేసేందుకు నేను అన్ని ప్రయత్నాలు చేశాను. మా నినాదం 'సంసద్ మే బీ కేజ్రీవాల్, తో ఢిల్లీ హోగీ ఔర్ ఖుష్ హాల్' (పార్లమెంట్లో కేజ్రీవాల్తో ఢిల్లీ మరింత అభివృద్ధి)' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఆప్ ఇప్పటికే నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. తూర్పు ఢిల్లీ, న్యూఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ స్థానాలకు ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తోంది. మిగిలిన మూడు స్థానాల్లో అంటే నార్త్ ఈస్ట్, చాందినీ చౌక్, నార్త్ వెస్ట్ (ఎస్సీ రిజర్వ్డ్) సెగ్మెంట్లలో అభ్యర్థులను నిలబెడుతోంది.

## రెండ్రోజుల పాటు మద్రాస్ ఐఐట సమ్మిట్

### కెటిఆర్కు ప్రత్యేక ఆహ్వానం

హైదరాబాద్,మార్చి8(ప్రజా మంటలు) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు మద్రాస్ ఐఐటి ఆహ్వానం అందింది. ఐఐటీ మద్రాస్ తమ విద్య సంస్థలో జరిగే అంట్రపెన్యూరల్ సమ్మిట్ అనే కార్యక్రమంలో ప్రసంగించాల్సిందిగా కేటీఆర్ను ఆహ్వానించింది. ప్రతి ఏటా ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే అంట్రపెన్యూరల్ ఫెస్టివల్ ఈ- సమ్మిట్ లో కీలకోపన్యాసం చేయాలని కోరింది. ఐఐటీ మద్రాస్లో ప్రతి ఏటా నిర్వహించే ఈ-సమ్మిట్కు దేశ విదేశాల నుంచి అంట్రపెన్యూరల్ రంగంలో కీలకమైన వ్యక్తులను, సంస్థల అధిపతులను, పాలసీ మేకర్లను, ప్రముఖ వ్యక్తులను ఆహ్వానిస్తుంది. కేటీఆర్కున్న అపారమైన అనుభవాన్ని పురస్కరించుకొని, భవిష్యత్తు అంట్రపెన్యూరల్ ఔత్సాహికులకు దిశా నిర్దేశం చేయాల్సిందిగా కేటీఆర్కు పంపిన ఆహ్వానంలో ఐఐటీ మద్రాస్ పేర్కొంది. ఐఐటీ మద్రాస్ విద్యార్థులు ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దేశంలోనే అంతర్జాతీయ గుర్తింపు ఐఎస్ఓ సర్టిఫికేషన్ కలిగిన ఏకైక కార్యక్రమంలో నిలిచింది. శని,ఆదివారాల్లో జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించాల్సిందిగా కేటీఆర్కు పంపిన ఆహ్వానంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఒకరైన క్రిస్ గోపాలకృష్ణన్, హెచ్సీఎల్ సహ వ్యవస్థాపకులు అజయ్ చౌదరి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నట్లు ఐఐటి మద్రాస్ తెలిపింది.



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణం లోని శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయాన్ని పట్టణ సీఐ సూరం వేణుగోపాల్ సందర్శించి మూలమూర్తికి పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామివారి శేష వస్త్రంతో ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు. పాల్గొన్న రజక సంఘ బాధ్యులు, పెద్దలు తదితరులు

## మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలన్ని భక్తులతో కిటకిట

**జగిత్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్న పలు శైవాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి శివరాత్రి పర్వదినం శుక్రవారం నుంచి పలు ఆలయాల్లో వేద పండితులు వైదికపరంగా మహా శివుడికి అత్యంత ఇష్టమైన అభిషేకాది పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని పౌలస్తేశ్వరస్వామి, దుబ్బ రాజన్న ఆలయంతో పాటుగా, పట్టణంలోని శివాలయం, మార్కండేయ ఆలయం, గుట్ట రాజ రాజేశ్వరస్వామి వారి ఆలయంతో పాటుగా పలు ఆలయాలలో హర హర మహాదేవ అనే ఆధ్యాత్మిక ధ్వనులతో మారు మ్రోగిపోతున్నాయి. ఈ సందర్భంగా మడేలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభిషేకాది పూజా కార్యక్రమాలలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ తో పాటు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, మడేలేశ్వరస్వామివారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొనగా, ఆలయ అర్చకులు పార్థసారథి శర్మ, రాజేంద్ర శర్మ, కేదారేశ్వర శర్మ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ఆలయాల్లో భక్తులు భారీగా తరలి వెళ్తూ, మహాశివుడికి ఇష్టమైన అభిషేక పూజా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

## పావని కంటి ఆస్పత్రిలో ఉచిత శస్త్ర చికిత్సలు

జగిత్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):



జగిత్యాల పావని కంటి ఆసుపత్రి మరియు ఆపి,రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యం లో జగిత్యాల నియోజకవర్గ మరియు పరిసర ప్రాంతాలకు చెందిన 15 మంది నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి, ఉచిత మందులు, కళ్ళ అద్దాలు పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో డా. విజయ్, బిఆర్ఎస్ నాయకులు చిట్ల రమణ, జుంబర్తి శంకర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## దుబ్బ రాజన్న ఆలయంలో అభిషేకం చేసిన డా. బోగ శ్రావణి దంపతులు

**జగిత్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):**



శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం సారంగాపూర్ పెంబట్లకోనాపూర్ శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన డా. భోగ శ్రావణి ప్రవీణ్. వారితోపాటు నాయకులు వీరబత్తిని అనిల్, ఆముద రాజు, గంగరాజం, డీటీ వెంకటేష్, ప్రమోద్, శేఖర్, సత్య,వంశీ, పవన్, రెడ్డి పాల్గొన్నారు.

## దుబ్బరాజన్న ను దర్శించుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి

**జగిత్యాల రూరల్ జగిత్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం లోని పెంబట్ల కోనాపూర్ గ్రామంలో గల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు అర్చకులు సన్మానించారు. ఈకార్యక్రమంలో వారి వెంట మాజీ మున్సిపల్ చైర్పర్సన్ విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్లు సింగరావు, అల్లే సాగర్, దాసరి లావణ్య, సర్పంచ్ ఈవో తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మడేలేశ్వరుని దర్శించుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

**జగిత్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):**



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జగిత్యాల పట్టణంలోని శ్రీ మడేలేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ . అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదం అందజేశారు. వారి వెంట కౌన్సిలర్లు సింగరావు, దాసరి లావణ్య, చుక్క నవీన్, సిరికొండ పద్మ, అల్లే గంగసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పశుపతి నాథ స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పండగ ప్రత్యేకతపై కార్యక్రమము

ఎల్కతుర్తి మార్చ్ 08 (ప్రజామంటలు):



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలము వల్బాపూర్ గ్రామంలో శ్రీ పశుపతినాథ స్వామి దేవాలయములో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ గణపతి పూజా పుణ్యాహవాచనము స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు పంచామృత అభిషేక కార్యక్రమాలు బిల్వ అర్చనలు నిర్వహించడం జరిగినదనీ ఆలయ అర్చకులు శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి , చరణ్ సిద్ధాంతి తెలియజేశారు కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ గంజి భావనఋషి సభ్యులు రామారావు రవీందర్రావు అనంతరాములు కొమరయ్య, శ్రవణ్, లింగారావు, సూరయ్య, గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకునీ తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈరోజు సాయంత్రం 8 గంటల ప్రాంతంలో స్వామివారికి శివపార్వతుల కళ్యాణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అర్చకులు తెలియజేశారు.

## సుద్దముక్క పై 108 శివలింగాలు





**గొల్లపల్లి మార్చ్ 08 (ప్రజామంటలు):**

ఒకే లింగముపై 108 శివలింగాలను చెక్కాడు గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన కవి సూక్ష్మ కళాకారుడు సైకిత శిల్పి గాలిపెల్లి చోలేశ్వర్ చారి. వీరు ఆరు గంటలకు కష్టపడి రెండు ఇంచుల శివలింగాన్ని చెక్కుతూ ఒకే లింగం మీద 108 చిన్న చిన్న శివలింగాలను చెక్కినట్టు తెలిపాడు. ఎంతో భక్తి పారవశ్యంతో ఈ శివలింగాన్ని రూపొందించినట్లు తెలిపారు. 14 వరసలో ప్రతి వరుసలో 8 శివలింగాలను చెక్కినట్టు తెలిపారు. ఇదివరకు వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి గర్భాలయ శివాలయాన్ని బియ్యపు గింజలు సగం ఉండేట్లుగా చెక్కరు. సూక్ష్మ కళాకారుడిగా అనేక సందర్భాల్లో చారి ప్రభుత్వం చే ఉత్తమ చిత్రకారుడిగా, ఉత్తమ సైకత శిల్పిగా ఉత్తమ ఉపాధ్యాయునిగా 2024 లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు పొందారు. సుద్దముక్కలతో పాటు ఆకులు పాలు, నీళ్లు, ఆకులు, బియ్యం గింజలు ఇతర వస్తువుల మీద కూడా శిల్పాలు చెక్కడం లో నేర్పరి. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియా బుక్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లాంటి పలు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నారు. వీరు ప్రస్తుతం వేములవాడ లోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో ఆర్ట్ టీచర్ గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా రాఘవపట్నం గ్రామ పెద్దలు, గ్రామస్తులు, శివభక్తులు చోలేశ్వర్ చారిని అభినందించారు.

## అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణం

**గొల్లపల్లి మార్చ్ 08 (ప్రజామంటలు):**



గొల్లపెల్లి మండలం లోత్తునూర్ లో మహా శివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో శివ పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగాయి ఈ కళ్యాణ మహోత్సవంలో పార్థ పిల్లల హాస్పిటల్ జగిత్యాల డా. అంకం లక్ష్మణ్ –అరుణ దంపతులచే ఆలయ అర్చకులు సాయి చరణ్ ఆధ్వర్యంలో స్వామి కళ్యాణం, హెూమం మహిళలు కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోనాల రత్నయ్య, రేగొండ సత్యనారాయణ, పుట్ట పాక సత్యం, పొన్నం స్వామి, చిరుత తిరుపతి, కొం డయ్య, సుమన్, మారుతి, లక్ష్మీకాంతం, శ్రీనివాస్, దీక్ష స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి పర్వదినాన శివపార్వతుల కళ్యాణ మహెూత్సవం

ఎల్కతుర్తి మార్చ్ 08 (ప్రజామంటలు):



ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో మహాశివరాత్రి పర్వ దినం సందర్భంగా సూరారం గ్రామ శివారులో గల శ్రీ సింగరాయ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కళ్యాణ మహెూత్సవం లో పాల్గొన్న ఎల్కతుర్తి మండలం వైస్ ఎంపీపీ తంగేడ నగేష్ దంపతులు మరియు ఎల్కతుర్తి మండలం సింగిల్విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్.బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్. మాజీ ఎంపీపీ తంగెడ శాలిని మహేందర్. దంపతులు పాల్గొన్నారు. శివపార్వతుల కళ్యాణ మహెూత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామి వారి కళ్యాణాన్ని తిలకించి స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బచ్చు రాజేశ్వర్ రావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, వివిధ గ్రామాల భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలి

### ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

**సైదాపూర్ మార్చ్ 08 (ప్రజామంటలు):**

రాష్ట్రం ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర రవాణా %ం% బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సైదాపూర్ మండలంలోని ఏగ్లాస్పూర్, గుజ్జులపల్లి, బొమ్మ కల్లు, గ్రామాలను తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకుని మహాశివరాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని గుళ్ళకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకూడదని, అన్ని సదుపాయాలు వారికి అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఆడపడుచులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు ఆయన ప్రత్యేకంగా తెలియజేశారు. మహిళలు అన్ని రంగాలలో రాజకీయాలలో పూర్తి సార్థగత సాధించాలని ప్రతి ఒక్కరిని ప్రేరేపించేలా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## రామకిష్టాపురం మామిడి తోటలో శివునికి అభిషేకం

**కొడిమ్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):**



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొడిమ్యాల, రామకిష్టాపురం గ్రామాల మధ్య మామిడి తోటలో స్వయంభూగా వెలిసిన లింగానికి పంచామృత అభిషేకం, లింగాష్టకం, పత్రి, పండ్లు, పూలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇట్టి పూజ కార్యక్రమాలు అర్చకులు నాగరాజు శ్రీనివాస్, నాగరాజు రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సుందరయ్య నగర్ కాలనీలో మహిళా దినోత్సవ వేడుకలు

**ఎల్కతుర్తి మార్చ్ 08 (ప్రజామంటలు):**



ఎల్కతుర్తి సుందరయ్య కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, కేక్ కట్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, వాసుదేవ రెడ్డి, జిల్లా కార్యదర్శి, గుమ్మడి రాజుల రాములు, జిల్లా కమిటీ సభ్యుడు, బాల్ నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యురాలుఅంబాల స్వరూప, జిల్లా కమిటీ సభ్యురాలు, లోకిని స్వరూప, మండల కార్యదర్శి, అంబాల మమత, మండల అధ్యక్షురాలు, దుంపేటి అరుణ, కమిటీ సభ్యులు ఈ మధ్యకాలంలో సిపిఎం తరపున గుడిసెలు వేసుకోవడం జరిగినది గుడిసె వాసులు పాల్గొన్నారు.

## "హీరోయిన్స్ ఆఫ్ రియల్ లైఫ్" పిఎంజే జ్యువెల్స్ 'బ్లిస్ కలెక్షన్' ఆవిష్కరణ

**హైదరాబాద్ మార్చ్ 08 (ప్రజామంటలు):**




అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని.., ట్రెండ్‌సెట్టింగ్ డిజైన్లతో, అసమానమైన కస్టమర్ సేవలతో, నాణ్యత–మన్నికకు వేడుకగా నిలిచిన హైదరాబాద్‌లోని పి ఎం జే జ్యువెల్స్ ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో అద్భుత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం వివిధ రంగాల్లోని విశిష్ట మహిళలు, ఆయా రంగాల్లో అడ్డంకులను అధిగమించి విజేతలుగా నిలిచిన నిజ జీవిత తారల విశేషమైన సహకారాన్ని గౌరవించడం కోసం అంకితం చేయబడింది. ఈ సత్కార కార్యక్రమం మీడియా ప్రముఖులు, వైద్యులు, ఐటీ నిపుణులు, వ్యాపార మహిళలు, న్యాయవాదులు తదితర విభాగాల్లో సామాజిక అడ్డంకులను ఛేదిస్తూ తమ ప్రశస్తిని కొనసాగిస్తున్న మహిళల విజయాలను గుర్తించింది. ఉమెన్ ఆఫ్ బ్లిస్ అని పిలవబడే ఈ విశిష్టమైన మహిళల సమావేశం పి ఎం జే జ్యువెల్స్ యొక్క 'బ్లిస్ కలెక్షన్'ను కూడా ప్రారంభించింది. ఈ కార్యక్రమం సందర్భంగా యాంకర్ స్వప్న, సేల్స్ ఫోర్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ లక్ష్మి, ఫైనాన్షియల్ కన్సల్టెంట్ స్వాతి, లూసిడ్ డయాగ్నోస్టిక్స్‌కు చెందిన డాక్టర్. సునీత లు శుభాకాంక్షలు తెలిపారు. యాంకర్ స్వప్న ప్రసంగిస్తూ., మహిళలు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం, వృత్తి పరమైన ప్రదేశాల్లో వివక్షకు వ్యతిరేకంగా ప్రశ్నించడం యొక్క ప్రాముఖ్యతను చెప్పారు. పిఎంజే డైరెక్టర్ సీమా మాట్లాడుతూ,ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళ అవిశ్రాంత కృషి, అంకితభావాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. ఇది భవిష్యత్ తరాల మహిళలకు ఉన్నత మార్గాలకు చేరడానికి సుగమం చేస్తుందని అన్నారు. "లింగ వివక్ష లేని సమాజం నిజమైన ఆనందాన్ని సూచిస్తుంది" నే బ్లిస్ కలెక్షన్ సారాంశాన్ని నొక్కి చెప్పారు. విస్తృతమైన పరిశోధన, మార్కెట్ విశ్లేషణ, పలు పరీక్షల ఫలితంగా ఈ బ్లిస్ కలెక్షన్.. ప్రతి మహిళకు తన ప్రత్యేకమైన వ్యక్తిత్వానికి మద్దతునిచ్చే విభిన్న ఎంపికలను అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకతో పాటు తమిళనాడులోని మొత్తం 30 పి ఎం జే స్టోర్‌లలో, బ్లిస్ కలెక్షన్ త్వరలో అందుబాటులోకి వస్తుందని శ్రీమతి సీమ ప్రకటించింది. ఇది బ్రాండ్ యొక్క సమగ్రత, సాధికారత పట్ల నిబద్ధతను మరింతగా పెంచుతుందని తెలిపారు. పి ఎం జే బ్రాండింగ్ కన్సల్టెంట్ నివేదిత సౌతేకల్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పిఎంజే జ్యువెల్స్ బ్లిస్ కలెక్షన్‌ను ప్రారంభించడంతో పాటుగా వృత్తిపరమైన మహిళల శక్తి, స్థితిస్థాపకత, విజయాలను గుర్తించడం గర్వంగా ఉందని ఆమె అన్నారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు

కొడిమ్యాల మార్చ్ 08 (ప్రజామంటలు):



కొడిమ్యాల మండల కేంద్రము లో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి నెల శ్రవణా నక్షత్రం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలలో భాగంగా ఈరోజు స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది ఇట్టి పూజ కార్యక్రమలు ఆలయ అర్చకులు నాగరాజు రమేశ్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ అమర లింగేశ్వర స్వామి దేవాలయం (పంచాయతన నవగ్రహ) శిలా, విగ్రహ, యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా మున్సిపల్ అడువాల జ్యోతి లక్ష్మణ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. వెంట కౌన్సిలర్ దాసరి లావణ్య, ఆలయ కమిటీ సభ్యులున్నారు.



# వైవిధ్యంగా గామి మూవీ కథాకథనం కోసం దర్శకుడి ఆరాటం

విశ్వక్ సేన్ వైవిధ్యం వున్న పాత్రలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నారు. అలాంటి వైవిధ్యమున్న సినిమా 'గామి' అని విశ్వక్, చిత్ర నిర్వాహకులు చెబుతూ వస్తున్నారు. ఈ చిత్రానికి ప్రచారాలు కూడా విరివిగా చేశారు, ప్రచార చిత్రాలు చాలా ఆసక్తికరంగా కూడా వున్నాయి. ఈ సినిమా పూర్తి చేయడానికి సుమారు ఐదేళ్లు పట్టింది. ఈ సినిమాతో విద్యాధర కాగిత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా కోసమని ఎక్కడో హిమాలయాల్లో మంచు బాగా కురిసే ప్రాంతాల్లో షూటింగ్ చేయడం, కొన్నిసార్లు ప్రత్యేకమైన ఋతువులకోసం ఎదురుచూడటం వంటివి చేయడంతో సినిమా పూర్తి చేయడానికి చాలా కాలం పట్టిందని చెబుతున్నారు. ఇందులో విశ్వక్ సేన్ అఘోరా పాత్రలో కనపడనున్నారని ప్రచారాల్లో చెప్పారు. చాందిని చౌదరి కథానాయికగా నటించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని థియేటర్లలోకి వచ్చింది. శంకర్ (విశ్వక్ సేన్) ఒక అఘోర, అతనికి మానవ స్పర్శ, అంటే ఇంకొక మానవుడిని ఎవర్ని ముట్టుకున్నా అతనికి అదొక రకమైన వ్యాధి వచ్చి చనిపోతాడు. శంకర్‌కి ఉన్న ఈ వ్యాధికి మందు హిమాలయాల్లోని త్రివేణి సంగమం దగ్గర ఉండే ఒక మొక్కలో ఆ ఔషధం ఉంటుందని, ఆ ఔషధం తీసుకుంటే శంకర్ వ్యాధి నయమవుతుందని స్వామీజీ చెప్తాడు. ఈ మొక్క కూడా 35 సంవత్సరాలకు ఒకసారి వస్తుందని.. ఆ సమయంలోనే ఆ మొక్కని తీసుకురావాలని చెప్తాడు. జాహ్నవి (చాందిని చౌదరి) ఒక డాక్టర్, రీసర్చ్ కోసం అదే ఔషధం కోసం ప్రయత్నం చేస్తుంది. శంకర్‌ని ఆ హిమాలయాలకి తీసుకువెళతానంటుంది. మరోవైపు దక్షిణ భారతదేశంలో ఒక గ్రామంలో దుర్గ అనే దేవదాసి తన కుమార్తె ఉమతో ఉంటుంది. ఆమెకు దేవదాసి నుండి తప్పించేస్తారు, కుమార్తెని దేవదాసిగా చేయాలని చూస్తారు. ఇంకోవైపు ఒక లేబరేటరీలో మనుషుల మీద వివిధ రకాలైన భయంకరమైన పరీక్షలు చేస్తూ ఉంటారు, అక్కడి నుండి ఒక అబ్బాయి తప్పించుకొని బయటపడతాడు. ఈ మూడు కథలు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా జరుగుతూ ఉంటాయి. శంకర్‌కు ఆ ఔషధం తీసుకురావడంలో ఎదురైన పరిస్థితులు ఏంటి? చివరికి సాధించాడా? జాహ్నవి ఏమైంది? దేవదాసి కుమార్తె తప్పించుకొని ఎక్కడికి వెళ్లింది? బయటపడిన కుర్రాడు ఏమయ్యాడు? ఇవన్నీ 'గామి' సినిమాలో తెరకెక్కించారు. తెలుగు సినిమాలో ఒక వైవిధ్యమైన కథ చెప్పాలని, సినిమా అంటే వ్యాపార విలువలే కాకుండా ఒక మంచి కథ కూడా చెప్పాలని ఈ చిత్ర దర్శక నిర్మాతలు ప్రయత్నం చేసారు. ఇక తెరమీద ఒక్కో సన్నివేశం చాలా అద్భుతంగా కనిపిస్తూ ఉంటుంది. అందమైన ఆ మంచు ప్రదేశాలు, ఆ కొండలు, ఆ పర్వతాలు, ఔషధం కోసం శంకర్ పడే పాట్లు, సాహసాలు, సంఘటనలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. దర్శకుడు చాలా తెలివిగా కథనాన్ని అల్లుకున్నాడు. శంకర్‌కి ఎందుకు మానవ స్పర్శ తగలకూడదు.. తగిలితే ఏమవుతుంది అనే విషయాన్ని దర్శకుడు చివరివరకు ఆసక్తిగా కొనసాగించాడు. మరోవైపు గ్రామాల్లో జరిగే దేవదాసి సంప్రదాయం ఎంత కఠినంగా ఉంటుందో చూపించాడు. అలాగే మనుషుల మీద ప్రయోగాలు చేసే శాస్త్రవేత్తలు వాళ్ళ మధ్యలో కొంతమంది మనుషులు ఏ విధంగా నరకయాతన పడుతున్నారనేది చాలా బాగా చూపించాడు. ఈ సినిమాలో మాటలు తక్కువగానే ఉన్నప్పటికీ.. అవే చాలా ఆలోచింపజేసేలా ఉంటాయి.ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా ఉందంటే అందుకు చాయాగ్రహణం చాలా ముఖ్యం చాలా బాగా చూపించారు. దానికి తోడు నేపథ్య సంగీతం బాగా తోడై సినిమా ఇంకో లెవెల్‌కి వెళ్లడానికి ఉపయోగ పడింది. వీటన్నింటిని జనరంజకంగా మలిచినందుకు దర్శకుడిని అభినందించాలి. ఇక నటీనటుల విషయానికి వస్తే విశ్వక్సేన్ శంకర్‌గా మంచి నటనను ప్రదర్శించాడీ సినిమాలో. శంకర్ పాత్రలో మమేకం అయిపోయాడు. సినిమాలో మనకి నటులు గుర్తుకురారు పాత్రలే




గుర్తుంటాయి. హీరోయిన్ చాందిని చౌదరి చాలా చక్కగా నటించింది. తెలుగమ్మాయిలు మంచి పాత్రలు వస్తే ప్రతిభ చూపిస్తారని చాందిని.. జాహ్నవి పాత్రలో నిరూపించింది. అభినయ దుర్గగా, ఉమగా వేసిన అమ్మాయి చాలా బాగా చేశారు. శంకర్ అనే ఒక అఘోర తనెవరో.. ఎక్కడి నుండి వచ్చాడో తెలుసుకోవాలని చేసే ప్రయాణంలో ఎదురైన భావోద్వేగ సంఘటనల ఆధారంగా మలచిన చిత్రం. ఆ లాబరేటరీ పరీక్షలవి ప్రేక్షకులకి అర్థం కాకపోవచ్చు. వాటిని పక్కన పెడితే.. వైవిధ్యం కోరుకునే తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా ఖచ్చితంగా నచ్చుతుంది.

# నాగసాధువులా తమన్నా

ఓటీటీ చిత్రం 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ అయిన 'ఓదెల 2'చిత్రం ఇటీవలే కాశీలో గ్రాండ్‌గా ప్రారంభమైంది. అశోక్ తేజ దర్శకత్వంలో సంపత్ నంది క్రియేటర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్‌లపై డి మధు హై బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఈ చిత్రంలో శివశక్తి పాత్రలో నటిస్తున్న తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాత్ర కోసం తమన్నా కంప్లీట్‌గా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. నాగ సాధువులా వేషం ధరించి.. ఒక దండము, మరో చేతిలో ఢమరుకం, నుదుటిపై పసుపు బొట్టు, దానిపై కుంకుమ బిందువుతో శివశక్తిగా అద్భుతం అనేలా తమన్నా దర్శనమిస్తోంది. కాశీ ఘాట్‌లపై నడుస్తూ, ఆమె కళ్ళు మూసుకుని దేవుడిని ప్రార్థిస్తూ కనిపిస్తున్నారు. తమన్నా విషయంలో ఇది అన్ బిలివబుల్ మేకోవర్ అనే చెప్పుకోవాలి. ఈ ఏజ్ హీరోయిన్లలో ఏ హీరోయిన్ కూడా ఇలా కనిపించింది లేదు. ఈ ఫస్ట్‌లుక్ అందరినీ ఆకట్టుకుంటూ.. శివరాత్రికి ఇది పర్ఫెక్ట్ ట్రీట్ అనేలా ఉంది. ఓదెల 2 గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ సినిమా రూపుదిద్దు కుంటోంది. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా ముఖ్య తారాగణం. ÷ఎఈచీ సినిమాలో టాప్ క్లాస్ ఉండబోతున్నాయని, 'ఓదెల 2' కోసం ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేయబోతున్నారని మేకర్స్ తెలుపుతున్నారు. యూనివర్సల్ అప్పీల్ ఉండే ఈ సినిమా నేషనల్ వైడ్‌గా విడుదల కానుందని మేకర్స్ తెలియజేశారు. కాగా.. సౌందర్ రాజన్ ఎస్ డీవోపీగా పని చేస్తుండగా, కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.




# గ్యాంగ్ ఆఫ్ గోదావరి పోస్టర్ విడుదల

టాలీవుడ్ నటుడు విశ్వక్‌సేన్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే విశ్వక్ నటించిన గామి చిత్రం ప్రేక్షకుల ముందుకురాగా మరో సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నాడు. విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. ఈ సినిమాకు ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నాడు. అంజలి, డీజే టిల్లు ఫేం నేహాశెట్టి హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఇక మహిళా దినోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మూవీ నుంచి కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇక ఈ పోస్టర్‌లో అంజలి కత్తి పట్టుకుని ఊరమాస్ లుక్‌లో కనిపిస్తుంది. ఇక ఈ సినిమాను మొదట మార్చి 8న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. అనుకోని కారణాల వల్ల ఈ సినిమా వాయిదా పడుతూ వస్తుంది. ఇక త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.





# టెలివిజన్ నటి డాలీ సోహి కన్నుమూత

టెలివిజన్ నటి డాలీ సోహి కన్నుమూశారు. కొంతకాలంగా గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతోన్న ఆమె శుక్రవారం ఉదయం మృతి చెందారు. తన సోదరి అమన్‌దీప్ కామెర్లకు చికిత్స తీసుకుంటూ మరణించిన కొన్ని గంటలకే డాలీ కూడా మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. 'డాలీ, అమన్‌దీప్ ఇద్దరూ ముంబైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అమన్‌దీప్ గురువారం సాయంత్రం కన్నుమూశారు. డాలీ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. హిందీలో పలు సీరియల్స్‌లో నటించిన డాలీ గతేడాదిలో కీమోథెరపీ చేయించుకున్న ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకున్నారు. పోరాడే శక్తి మీలో ఉంటే ఎంత కష్టమైన ప్రయాణమైనా.. సులభం అవుతుంది. క్యాన్సర్ వచ్చిందని బాధపడుతూ ఉండిపోవాలా.. లేదంటే ధై?ర్యంగా దాన్ని ఎదుర్కొని ఆదర్శంగా నిలవాలో మన చేతిలోనే ఉంటుంది' అని అందరిలో ధైర్యాన్ని నింపేలా పోస్ట్ చేశారు. హిందీలో 'రనక్', 'మేరీ ఆషికీ తుమ్సే హి' వంటి సీరియల్స్‌తో డాలీ ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. తాజాగా ఆమె మరణంతో హిందీ పరిశ్రమలో విషాదం నెలకొంది.



# లంబసింగి నుంచి పాటవిడుదల

భరత్‌రాజ్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'లంబసింగి' .. ఎ ప్యూర్ లవ్‌స్టోరీ... అనేది ఉప శీర్షిక. నవీన్ గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. 'బిగ్ బాస్' ఫేమ్ దివి కథానాయికగా నటిస్తున్నారు. ఆనంద్.టి నిర్మిస్తున్నారు. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ కురసాల సమర్పకులు. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఇందులోని 'వయ్యారి గోదారి నువ్వే... నా దారికొచ్చి చేరావులే...' అంటూ సాగే పాటని విడుదల చేసింది చిత్రబృందం. ఈ పాటకి కాసర్ల శ్యామ్ సాహిత్యం సమకూర్చగా, జావేద్ అలీ ఆలపించారు. ఆర్.ఆర్.ధ్రువన్ స్వరకర్త. ఈ మెలోడీ పాటకు సంగీత ప్రియుల నుంచి మంచి స్పందన వస్తోంది.

# కామెడీ టైమింగే నన్ను ఆకట్టుకుంది



## భర్త జాకీ భగ్నానీపై రకుల్ ప్రీత్ కామెంట్

వివాహమైన తర్వాత తొలిసారి తన భర్త జాకీ భగ్నానీ గురించి మాట్లాడారు నటి రకుల్ ప్రీత్ సింగ్ . అస్సాం వేదికగా జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జాకీ తనకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ చాలా ఎక్కువని చెప్పగా, పక్కనే ఉన్న రకుల్ అది నిజమేనన్నారు. ఆయన్ని పొగడ్తలతో ముంచెత్తారు. 'జాకీ మంచి మనసు, హాస్య చతురత కలిగిన వ్యక్తి. అతడిలోని కామెడీ టైమింగే తొలుత నన్ను ఆకర్షించింది. తను ఎప్పుడూ సరదాగా ఉంటాడు. చుట్టూ ఉన్నవాళ్లు సంతోషంగా ఉండేలా చూస్తాడు' అని ఆమె అన్నారు. కన్నడ చిత్రం 'గిల్లీ'తో తెరంగేట్రం చేసిన రకుల్ హిందీ పరిశ్రమలో ఇటీవల దశాబ్దకాలం పూర్తి చేసుకున్నారు. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సమయంలో కామన్ ఫ్రెండ్స్ వల్ల బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో ఆమెకు పరిచయం ఏర్పడింది. గత మూడేళ్ల నుంచి వీరిద్దరూ ప్రేమలో ఉన్నారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఫిబ్రవరి 21న వీరి పెళ్లి జరిగింది. గోవాలోని ఓ ప్రముఖ రిసార్ట్స్‌లో జరిగిన వివాహ వేడుకల్లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. వివాహం అనంతరం ఇటీవల అస్సాం టూర్‌కు వెళ్లారు. అక్కడి ప్రముఖ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అస్సాం స్టేట్ ఫిల్మ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కన్నప్ప నుంచి ఫస్ట్ లుక్ విడుదల

మంచు విష్ణు ప్రధానపాత్రలో నటిస్తోన్న ఫాంటసీ డ్రామా 'కన్నప్ప' రూపుదిద్దుకొంటోంది. ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకుడు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ నుంచి చిత్ర బృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 'కన్నప్ప' ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఇందులో మంచు విష్ణు కన్నప్పగా కనిపించి అలరించారు. భారీ బ్జడెట్, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో సీనియర్ నటుడు మోహన్‌బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్-నయనతారలు శివపార్వతులు గా కనిపించనున్నారని టాక్ వినిపిస్తుండగా, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రం అత్యధిక భాగాన్ని న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు.



## తొలి రెండు రోజు

# టీమిండియా ఆధిపత్యం



ధర్మశాల వేదికగా జరుగుతున్న చివరి టెస్టు మ్యాచ్‌లో తొలి రెండు రోజుల్లో టీమిండియా ఆధిపత్యం ప్రదర్శించింది. ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగులకు ఆలౌట్ చేసిన రోహిత్ సేన.. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించే దిశగా కొనసాగుతోంది.భారత కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ సెంచరీలు చేశారు. ఇక రెండో రోజు ఆట ముగిసే సరికి భారత జట్టు ఆధిక్యం 250 పరుగులు దాటింది. కాగా.. భారత్ 255 పరుగుల ఆధిక్యంలో ఉంది. క్రీజులో కుల్దీప్ యాదవ్ (27), జస్ప్రీత్ బుమ్రా (19) పరుగులతో ఉన్నారు. ఓవర్ నైట్ స్కోరు 135/1తో రెండో రోజు ప్రారంభించిన టీమిండియా దూకుడుగా ఆడింది. టీమిండియా ఇన్నింగ్స్ లో రోహిత్ శర్మ (103), శుభ్‌మన్ గిల్(110) సెంచరీలతో చెలరేగారు. మరోవైపు.. వీరికి తోడు మిడిలార్డర్ లో దేవ్ దత్ పడిక్కల్ (65), సర్ఫరాజ్ ఖాన్ (56) పరుగులు చేయడంతో ఇండియా భారీ స్కోరు చేసింది. టీమిండియా బ్యాటర్లలో రవీంద్ర జడేజా (15), ధృవ్ జురెల్ (15), అశ్విన్ డకౌట్ అయ్యారు. ఇక.. ఇంగ్లండ్ బౌలర్లలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. టామ్ హార్ట్లీ 2 వికెట్లు తీశాడు. అండర్సన్, స్టోక్స్ కు తలో వికెట్ దక్కింది. ఇదిలా ఉంటే.. ఇంగ్లండ్ ప్రధాన పేసర్ అండర్సన్ టెస్టుల్లో 700 వికెట్ల మైలురాయికి ఒక వికెట్ దూరంలో ఉన్నాడు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 57.4 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. భారత్ స్పిన్ బౌలర్ల దాటికి ఇంగ్లండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. కుల్దీప్ యాదవ్, అశ్విన్ చెలరేగడంతో ఇంగ్లండ్ 218 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 5, అశ్విన్ 4 పడగొట్టారు. ఇదిలా ఉంటే.. భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఇంగ్లండ్ మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ జానీ బెయిర్‌స్టోకు ఇది 100వ టెస్టు మ్యాచ్ కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో సెంచరీ చేసిన కెప్టెన్ రోహిత్ శర్మకు టెస్టు క్రికెట్‌లో ఇది 12వ సెంచరీగా నిలిచింది.మొత్తంగా రోహిత్ వన్డేల్లో 31 సెంచరీలు, టీ20ల్లో 5 సెంచరీలు సాధించాడు. ఈ టెస్టు సెంచరీతో రోహిత్ శర్మ పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజామ్‌ను అధిగమించి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో స్టీవ్ స్మిత్ రికార్డును సమం చేశాడు.తొలి ఇన్నింగ్స్‌లో 54 బంతులు ఎదుర్కొన్న రోహిత్ శర్మ 3 సిక్సర్లు, 13 ఫోర్ల సాయంతో సెంచరీ సాధించాడు. ఈ సిరీస్‌లో రోహిత్‌కి ఇది రెండో సెంచరీ. గతంలో విశాఖపట్నంలోనూ రోహిత్ సెంచరీ సాధించాడు. అలాగే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో రోహిత్‌కి ఇది తొమ్మిదో సెంచరీ.జో రూట్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక సెంచరీలు సాధించి, నంబర్‌వన్‌గా నిలిచాడు. డబ్ల్యూటీసీలో ఇప్పటి వరకు 52 మ్యాచ్‌లు ఆడిన రూట్ 13 సెంచరీలు చేశాడు.రెండో ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియా ఆటగాడు మార్నస్ లాబుషాగ్నే 11 సెంచరీలు చేశాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ 10 సెంచరీలతో మూడో స్థానంలో ఉన్నాడు.నాలుగో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా ఆటగాడు స్టీవ్ స్మిత్ ఇప్పటివరకు 9 సెంచరీలు సాధించాడు. ప్రస్తుతం 9వ సెంచరీ నమోదు చేసిన రోహిత్.. స్మిత్ రికార్డును సమం చేశాడు. స్టీవ్ స్మిత్ 45 మ్యాచ్‌ల్లో 9 సెంచరీలు చేయగా, రోహిత్ 32 మ్యాచ్‌ల్లో 9 సెంచరీలు సాధించాడు. పాకిస్థాన్ ఆటగాడు బాబర్ ఆజం 29 మ్యాచ్‌ల్లో 8 సెంచరీలు సాధించగా, ఇప్పుడు బాబర్ రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు. ఇది మా త్రమే కాదు, అంతర్జాతీయ క్రికెట్‌లో ఓపెనర్‌గా అత్యధిక సెంచరీలు సాధిం చిన వెస్టిండీస్ దిగ్గజ బ్యాట్స్‌మెన్ క్రిస్ గేల్‌ను రోహిత్ శర్మ అధిగమించాడు. క్రికెట్‌లోని మూడు ఫార్మాట్లలో ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా క్రిస్ గేల్ 42 సెంచరీలు సాధించగా, రోహిత్ శర్మ 43 సెంచరీలతో ఉన్నాడు.ఈ విషయంలో రోహిత్ కంటే ఇద్దరు బ్యాట్స్‌మెన్ ముందున్నారు. వారిలో ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ వార్నర్, సచిన్ టెండూల్కర్ ఒకరు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఓపెనర్‌గా వార్నర్ 49 సెంచరీలతో నంబర్ వన్ స్థానంలో ఉండగా, సచిన్ టెండూల్కర్ 45 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు.




## టి20 వరల్డ్ కప్ నాటికి అందుబాటులోకి సూర్య కుమార్ యాదవ్



ప్రస్తుతం ప్రపంచ క్రికెట్ ప్రేక్షకులందరూ కూడా ఈ ఏడాది ప్రారంభం కాబోయే టి20 వరల్డ్ కప్ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు అన్న విషయం తెలిసిందే. ఈ పొట్టి ఫార్మాట్లో ఉండే ధనా ధన్ ఇన్నింగ్స్ లు చూసి అదిరిపోయే ఎంటర్టైన్మెంట్ పొందాలని భారీగానే ఆశలు పెట్టుకున్నారు. కాగా జూన్ నెలలో ఈ వరల్డ్ కప్ ప్రారంభం కాబోతుంది. అయితే గత ఏడాది ఇండియా వేదికగా జరిగిన వరల్డ్ కప్ టోర్నీలో చెత్త ప్రదర్శనలతో నిరాశపరిచిన భారత జట్టు ఇక ఇప్పుడు వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జరగబోయే టి20 వరల్డ్ కప్ ను మాత్రం తప్పనిసరిగా కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. ఈ క్రమంలోనే పక్క ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకుంటుంది అన్న విషయం తెలిసిందే. అయితే భారత జట్టు టి20 ఫార్మాట్లో మ్యాచ్ ఆడుతుంది అంటే చాలు ముందుగా అందరికీ గుర్తుకు వచ్చేది ఒక విధ్వంసకరమైన ప్లేయర్. అతను ఎవరో కాదు.. నయా మిస్టర్ 360 ప్లేయర్గా గుర్తింపు సంపాదించుకున్న సూర్య కుమార్ యాదవ్. అతను క్రీజులో నిలదొక్కుని ఆడుతూ ఉంటే చూడ్డానికి రెండు కళ్ళు సరిపోవు.. అద్భుతమైన ఆట తీరుతో ఎప్పుడు అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తూ ఉంటాడు ఈ ప్లేయర్. మైదానం నలువైపులా సూర్య కుమార్ యాదవ్ కొట్టే షాట్ల గురుంచి అబ్బో మాటల్లో వర్ణించడం కూడా కష్టమేమో అని అనిపిస్తూ ఉంటుంది. గత ఏడాది జరిగిన వరల్డ్ కప్ సమయంలో గాయం బారిన పడిన సూర్య కుమార్ యాదవ్ ఇక టి20 వరల్డ్ కప్ నాటికి అందుబాటులోకి వస్తాడా లేదా అనే విషయంపై సందిగ్ధత నెలకొంది. అయితే ఈ విషయంపై టీమిండియా ఫ్యాన్స్ అందరికీ కూడా అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. టీ20 స్పెషలిస్ట్ బ్యాట్స్మెన్ అయిన సూర్య కుమార్ యాదవ్ ఇక ఇటీవల గాయం నుంచి కోలుకుని ప్రాక్టీస్ మొదలు పెట్టాడట. ఈ విషయం తెలిసి ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి అని చెప్పాలి. దీంతో జూన్ రెండవ తేదీ నుంచి జరగబోయే టి20 వరల్డ్ కప్ టోర్నిలో సూర్య కుమార్ యాదవ్ భారత జట్టు విజయాలను కీలకపాత్ర వహిస్తాడని అభిమానులు అందరూ కూడా అనుకుంటున్నారు.



## అశ్విన్, కుల్దీప్ మధ్య చర్చ!

ధర్మశాల వేదికగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదవ టెస్టులో ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది.టీమిండియా స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, రవిచంద్రన్ అశ్విన్ మధ్య సరదాగా చర్చ జరిగింది. టీమ్‌ను లీడ్ చేస్తూ పెవిలియన్‌వైపు నడిచేందుకు ఇద్దరు నిరాకరించారు. చివరికి కుల్దీప్‌ను అశ్విన్ ఒప్పించాడు. దాంతో కుల్దీప్ టీమ్‌ను లీడ్ చేస్తూ పెవిలియన్‌వైపు నడిచాడు. ఇందుకుసంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఆర్ అశ్విన్ వందో టెస్ట్ ఆడుతున్న? విషయం తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌ను 218 పరుగులకే ఆలౌట్ చేయడంలో కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించాడు. ఐదు వికెట్లు పడగొట్టి ఇంగ్లీష్ బ్యాటర్లను కోలుకోనీయలేదు. ఇంగ్లండ్‌ను ఆలౌట్ చేసిన అనంతరం పెవిలియన్‌కు వెళ్తుండగా.. వందో టెస్ట్ ఆడుతున్న? అశ్విన్‌ను ముందుగా నడవమని సహచర ఆటగాళ్లు కోరారు. అయితే కుల్దీప్ 5 వికెట్లు తీయడంతో అశ్విన్ సహచరుల మాటను ఒప్పుకోలేదు. కుల్దీపే లీడ్ చేయాల్సిందిగా కోరాడు. బంతిని కూడా అతడికి ఇచ్చాడు. ఆ బంతిని కుల్దీప్ యాదవ్ మరలా.. ఆర్ అశ్విన్‌కే విసిరాడు. ఇలా నువ్వు నేను అంటూ అశ్విన్, కుల్దీప్ మధ్య కాసేపు చర్చ జరిగింది. చివరికి కుల్దీప్‌ను అశ్విన్ ఒప్పించాడు. దాంతో కుల్దీప్ టీమ్‌ను లీడ్ చేస్తూ పెవిలియన్‌వైపు నడిచాడు. ఇందుకుసంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. 100 టెస్ట్ ఆడుతూ, పైగా 500కు పైగా వికెట్లు తీసిన అశ్విన్ హుందాతనం చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఎంత ఎదిగినా ఒదగడం అశ్విన్‌ను చూసే నేర్చుకోవాలి అంటూ ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



## న్యూజిలాండ్ విజయాలలో కేన్ విలియమ్సన్, టిమ్ సౌథీల కీలక పాత్ర

సీనియర్స్ ప్లేయర్స్ కేన్ విలియమ్సన్, టిమ్ సౌథీలు ఇప్పటికీ న్యూజిలాండ్ విజయాలలో కీలక పాత్ర పోషిస్తున్నారు. విలియమ్సన్ పరుగుల వరద పాటిస్తుంటే.. సౌథీ వికెట్స్ పడగొడుతున్నాడు. అండర్19 ప్రపంచకప్ కలిసి ఆడిన ఈ ఇద్దరు.. అంతర్జాతీయ 100 టెస్ట్ మ్యాచ్ కూడా కలిసే ఆడారు. క్రైస్ట్‌చర్చ్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్ విలియమ్సన్, సౌథీలకు కెరీర్‌కి 100వ టెస్ట్ మ్యాచ్. 100 టెస్ట్ మ్యాచ్‌ల మైలురాయిని చేరుకున్న 5, 6వ న్యూజిలాండ్ ఆటగాళ్లుగా వీరు నిలిచారు. కేన్ విలియమ్సన్, టిమ్ సౌథీలు 2008లో జరిగిన ఐసీసీ పురుషుల అండర్19 ప్రపంచకప్‌లో ఆడారు. అండర్19 ప్రపంచకప్‌కు కొన్ని వారాల ముందు టీ20 ఫార్మాట్‌లో సౌథీ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. సంవత్సరం లోపే టెస్ట్ అరంగేట్రం కూడా చేశాడు. అయితే విలియమ్సన్ తన టెస్ట్ అరంగేట్రం చేయడానికి రెండేళ్లు వేచి చూడాల్సి వచ్చింది. ఈ ఇద్దరు మూడు ఫార్మాట్‌లలో వేగంగా ఎదిగారు. న్యూజిలాండ్ జట్టుకు కీలక ఆటగాళ్లుగా మారిపోయారు.కేన్ విలియమ్సన్, టిమ్ సౌథీల ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. 2011, 2015, 2019 మరియు 2023 వన్డే ప్రపంచకప్‌లు ఇద్దరు కలిసి ఆడారు. అంతేకాదు టీ20 ప్రపంచకప్‌లు కూడా ఆడారు. టీ20 ప్రపంచకప్ 2024 ఆడడానికి కూడా సిద్ధమయ్యారు. విలియమ్సన్ టెస్టుల్లో 8675 పరుగులు చేశాడు. ప్రస్తుత ఆటగాళ్లలో విలియమ్సన్ కంటే ఎక్కువ టెస్టు సెంచరీలు (32) ఎవరూ చేయలేదు. మరోవైపు సౌథీ 378 టెస్ట్ వికెట్స్ పడగొట్టాడు.

## ఆకట్టుకున్న దేవదత్ పడిక్కల్

రజత్ పాటిదార్‌కు బదులుగా టీమ్‌ఇండియాలో ఆడే అవకాశం దక్కించుకున్న మరో యంగ్ ప్లేయర్ దేవదత్ పడిక్కల్.. ధర్మశాల టెస్టు రెండో రోజు తొలి అర్ధ సెంచరీ సాధించి ఆకట్టుకున్నాడు. కేవలం 83 బంతుల్లోనే అర్ధ సెంచరీకి చేరుకున్న పడిక్కల్ 8 అద్భుతమైన ఫోర్లు, ఒక సిక్సర్ కూడా బాదాడు. సర్ఫరాజ్ ఖాన్ తో కలిసి పడిక్కల్ కూడా సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. సెంచరీలతో చెలరేగిన రోహిత్, గిల్ ల వికెట్లను వరుసగా కోల్పోయి కష్టాల్లో పడిన భారత జట్టును పడిక్కల్, సర్ఫరాజ్ ఖాన్ లు తలా హాఫ్ సెంచరీలతో భారత జట్టును మళ్లీ గాడిలో పెట్టేందుకు సహకరించారు. చివరగా, రెండో రోజు ఆటలో మూడో సెషన్‌లో షోయబ్ బషీర్ బాదిన పడిక్కల్ తన ఇన్నింగ్స్‌లో 103 బంతులు ఎదుర్కొని 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 65 పరుగులు చేశాడు. నిజానికి, ఇంగ్లండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ అవుట్ అయిన తర్వాత రజత్ పాటిదార్‌ను జట్టులోకి తీసుకున్నారు. రజత్‌కు కూడా వరుసగా 3 మ్యాచ్‌లు ఆడేందుకు అనుమతి లభించింది. కానీ 3 మ్యాచ్‌ల్లో 5 ఇన్నింగ్స్‌ల్లో రజత్ ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయలేదు. దీని కారణంగా ఇంగ్లండ్‌తో సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లో పాటిదార్‌ని తొలగించారు. దీంతో దేవదత్ పడిక్కల్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో చేరాడు. అవకాశం దొరికిన వెంటనే హాఫ్ సెంచరీలు సాధించి కోట్లాది మంది అభిమానులకు, కెప్టెన్‌కు పడిక్కల్ ఈ స్థానానికి నిజమైన అర్హుడిగా నిరూపించుకున్నాడు. రంజీ ట్రోఫీలో దేవదత్ పడిక్కల్‌కు మంచి రికార్డు ఉంది. ఈ కారణంగా అతను జట్టులోకి ఎంపికయ్యాడు. రంజీలో తన బ్యాట్‌తో చాలా పరుగులు చేసిన పడిక్కల్, రంజీ ట్రోఫీ 2023-24లో ఆడిన తన చివరి 4 మ్యాచ్‌లలో 3 సెంచరీలతో 556 పరుగులు చేశాడు.

## సన్ రైజర్స్ కొత్త జెర్సీ విడుదల



ఐపీఎల్ 2024 మార్చి 22న ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని ఫ్రాంచైజీలు ప్రాక్టీస్ మొదలుపెట్టాయి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ విషయానికొస్తే, కొత్త ప్లేయర్స్ తో బలంగా ఉంది. ఇప్పటికే ఐడెన్ మార్క్రమ్ ను కెప్టెన్ గా తొలగించి, ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ ప్యాట్ కమిన్స్ కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. జట్టులోనూ భారీగా మార్పులు చేపట్టింది. మరోవైపు..కొత్త జెర్సీని కూడా విడుదల చేసింది. ఆరెంజ్ కలర్ ను మిస్ కాకుండా వాటిపై నల్లని చారలను జిగ్ జాగ్ గా ప్రింట్ చేసిన జెర్సీలను సన్ రైజర్స్ తన ఆటగాళ్లకు అందించింది. అయితే.. హైదరాబాద్ చేరుకున్న సన్ రైజర్స్ ఆటగాళ్లు సరికొత్త జెర్సీలతో ఫొటో షూట్ కు హాజరయ్యారు. కొత్త జెర్సీతో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ ఫోటోలకు ఫోజులిచ్చాడు. కొత్త జెర్సీ విషయాన్ని రివీల్ చేస్తూ భువీ ఫోటోనే సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది. హైదరాబాద్ వేడిని బయటపెట్టడానికి సిద్ధం.. ఐపీఎల్ 2024 కోసం మా జ్వలించే కవచం అంటూ క్యాప్షన్లు జోడించింది. ఈ జెర్సీ సన్ రైజర్స్ ఫ్రాంచైజీకి బాగా కలిసొచ్చిందనే చెప్పాలి. ఎందుకో తెలుసా.. దక్షిణాఫ్రికాలో గత రెండు సీజన్లుగా ఎస్ఏ టీ20 లీగ్ ను సన్ రైజర్స్ గెలిచింది. ఐడెన్ మార్క్రమ్ నాయకత్వంలోని సన్ రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు వరుసగా 2023, 2024 సీజన్లలో చాంపియన్ గా నిలిచింది. ఆ టోర్నీలో ఏ డిజైన్ జెర్సీలు వాడారో, ఇప్పుడు ఐపీఎల్ లోనూ సన్ రైజర్స్ ఆటగాళ్లకు అదే డిజైన్ తో ఉన్న జెర్సీలు అందించారు. కలిసొచ్చిన జెర్సీతో అయినా ఐపీఎల్ లో తమ భాగ్యరేఖ మారుతుందేమోనని సన్ రైజర్స్ యాజమాన్యం ఆశిస్తోంది. రానున్న ఐపీఎల్ సీజన్ కోసం ఆరెంజ్ ఆర్మీ ఇదివరకే సన్నాహకాలను మొదలుపెట్టింది. అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో ప్రాక్టీస్‌ను షురూ చేసింది. మిగిలిన ఆటగాళ్లు కూడా ఒక్కొక్కరుగా హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ట్రైనింగ్ క్యాంప్‌కు చేరుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. సన్ రైజర్స్ హైదరాబాద్ ఈ సీజన్ తొలి మ్యాచ్‌ను మార్చి 23న కేకేఆర్‌తో ఆడనుంది.

## ఇంగ్లండ్‌పై చరిత్ర సృష్టించిన రోహిత్ సేన




భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో రోజుకో కొత్త రికార్డులు క్రియేట్ అవుతున్నాయి. ప్రతి మ్యాచ్‌లోనూ కొన్ని రికార్డులు నమోదవుతాయి. అందుకు తగ్గట్టుగానే ధర్మశాల వేదికగా జరుగుతున్న చివరి టెస్టు మ్యాచ్‌లో టీమిండియా బ్యాట్స్‌మెన్ అరుదైన రికార్డు సృష్టించారు. దీంతో 15 ఏళ్ల తర్వాత ఓ స్పెషల్ రికార్డ్‌ను రిపీట్ చేశారు. అయితే, ఇది ఇంగ్లండ్‌పై తొలిసారి కావడం గమనార్హం. భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో రోజుకో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. ప్రతి మ్యాచ్‌లోనూ కొన్ని రికార్డులు నమోదవుతాయి. అందుకు తగ్గట్టుగానే ధర్మశాల వేదికగా జరుగుతున్న చివరి టెస్టు మ్యాచ్‌లో టీమిండియా బ్యాట్స్‌మెన్స్ ఓ అరుదైన రికార్డు సృష్టించారు. ఇరు జట్ల మధ్య జరుగుతున్న ఐదో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా టాప్ 5 బ్యాట్స్‌మెన్‌లు 50 పరుగులకు పైగా ఇన్నింగ్స్ ఆడారు. వీరిలో రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ సెంచరీలు చేయగా, యశస్వీ జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, దేవదత్ పడిక్కల్ అర్ధశతకాలు సాధించారు. టీమ్ ఇండియా టాప్ ఫైవ్ బ్యాట్స్ మెన్ 50కి పైగా పరుగులు చేయడం ఇది మూడోసారి. టెస్టు ఫార్మాట్‌లో ఇంగ్లండ్‌పై భారత్ ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం.1998లో కోల్‌కతా వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తొలిసారి ఈ ఫీట్ సాధించిన సమయంలో ఓపెనర్ వీవీఎస్ లక్ష్మణ్ 95, నవజ్యోత్ సింగ్ సిద్ధూ 97, రాహుల్ ద్రవిడ్ 86, సచిన్ టెండూల్కర్ 79, ఆ తర్వాత కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ 163 పరుగులతో బలమైన ఇన్నింగ్స్ ఆడాడు. దీని తర్వాత 6వ స్థానంలో వచ్చిన సౌరవ్ గంగూలీ కూడా 65 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 219 పరుగుల తేడాతో విజయం సాధించింది.ఆ తర్వాత 1999లో మళ్లీ అదే ఫీట్ రిపీట్ అయింది. ఈసారి మొహాలీలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో ఈ రికార్డు నమోదైంది. జట్టు తరపున దేవాంగ్ గాంధీ 75, సదాగోపన్ రమేష్ 73, రాహుల్ ద్రవిడ్ 144, సచిన్ టెండూల్కర్ 126, సౌరవ్ గంగూలీ 64 పరుగులు చేశారు. అయితే ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆ తర్వాత మురళీ విజయ్ 87 పరుగులు, వీరేంద్ర సెహ్వాగ్ 293 పరుగులు, రాహుల్ ద్రవిడ్ 74 పరుగులు, సచిన్ టెండూల్కర్ 53 పరుగులు, వీవీఎస్ లక్ష్మణ్ 62 పరుగులు చేశారు. ఈ మ్యాచ్ 2009లో శ్రీలంకతో ముంబైలో జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. దాదాపు 15 ఏళ్ల తర్వాత మళ్లీ అదే ఘటన చోటుచేసుకుంది. ఈసారి యశస్వీ జైస్వాల్ 57 పరుగులు, రోహిత్ శర్మ 103 పరుగులు, శుభ్‌మన్ గిల్ 110 పరుగులు, దేవదత్ పడిక్కల్ 65 పరుగులు, సర్ఫరాజ్ ఖాన్ 56 పరుగులు చేశారు. అయితే, ఇంగ్లండ్‌పై భారత్ ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com